ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
తిరుపతి
జిల్లా వార్తలు
శుక్రవారం 28 మార్చి 2025



జాతరలో భక్తజన సందోహం



పూజలందుకుంటున్న పోలేరమ్మ

బంగారు చీర అలంకారంలో ముత్యాలమ్మ

కనుపూరు జాతరకు పోటెత్తిన భక్తజనం

చిల్లకూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో ముత్యాలమ్మ జాతరకు జనం పోటెత్తారు. మూడో రోజైన గురువారం అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ నుంచీ భక్తులు తరలి వచ్చారు. దీంతో తూర్పుకనుపూరు, కోట, సిద్ధవరం మార్గాలలో వాహనాల రాకపోకలు స్తంభించాయి. ముత్యాలమ్మ ఆలయం, పోలేరమ్మ గుడి వద్ద అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. భక్తుల రాకతో తూర్పుకనుపూరు జనసంద్రంలా మారింది. ప్రధానంగా భక్తులు ఎండ వేడిమికి తట్టుకోలేకపోయారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నివాసాల్లో, చెట్ల కింద సేద తీరారు. ఇక, వేయికండ్ల కుండలను భక్తులు నెత్తిన పెట్టుకుని గుడిపైకి కోడి పిల్లలు, చీరలు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. ముత్యాలమ్మతో పాటు గంగమిట్ట మీద ఉంచిన పోలేరమ్మకు కూడా పొంగళ్లు పెట్టుకున్నారు. గురునాథస్వామి, అంకమ్మకు వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పరవశంతో నృత్యాలు చేశారు. అనంతరం గంగమిట్ట సమీపంలో రెండు తాటిచెట్ల మధ్య వేసిన ఉయ్యాలలో పోలిశెట్టి, గణాచారులు అమ్మణ్ణికి ఉయ్యాల సేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆలయ ఈవో నవీన్‌కుమార్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ గీతాకుమారి బందోబస్తు నిర్వహించారు.

నేటితో ముగియనున్న జాతర

గంగమిట్ట మీద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పోలేరమ్మ అమ్మవారిని నాలుగో రోజైన శుక్రవారం ఉదయం ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించనున్నారు. దీంతో జాతర ముగుస్తుంది.

వేసవిలో బ్రేక్ దర్శనాల కుదింపు!

● సామాన్య భక్తులకు ప్రాధాన్యం కల్పించేలా టీటీడీ కసరత్తు

తిరుమల, మార్చి27(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో సామాన్య భక్తులకు ప్రాధాన్యం కల్పించేలా బ్రేక్ దర్శనాలను కుదించేందుకు టీటీడీ కసరత్తు చేస్తోంది. ఏపీతో పాటు ఇటీవల తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపైనా టీటీడీ వీఐపీ బ్రేక్ దర్శనాలకు కేటాయిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం శుక్ర, శనివారాల మినహా మిగిలిన అన్ని రోజులకు సిఫార్సులపై వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు జారీ చేస్తున్నారు. దీంతో పాటు సీఎంవోలు, కేంద్రమంత్రులు, టీటీడీ బోర్డు, శ్రీవాణిట్రస్టు, న్యాయశాఖ, పోలీసు, ఐఏఎస్, ఐపీఎస్, ప్రెస్, ఇన్‌కమ్‌ట్యాక్స్ ఇలా వివిధ విభాగాలు, అధికారుల సిఫార్సులపై, స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులకు బ్రేక్ దర్శనాలు ఇస్తున్న క్రమంలో ఉదయం ప్రారంభమవుతున్న బ్రేక్ దర్శనాలు మధ్యాహ్నం వరకు కొనసాగుతున్నాయి. కొంతమంది టీటీడీపై ఒత్తిడి చేసి అదనపు కోటాలో కూడా టికెట్లు పొందుతున్నారు. ఇదే పరిస్థితి వేసవిలోనూ కొనసాగితే సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఉందని భావిస్తున్న టీటీడీ బ్రేక్ దర్శనాల కుదింపుపై కసరత్తు మొదలుపెట్టింది. రానున్న పది రోజుల్లో బ్రేక్ దర్శనం సమయాన్ని తగ్గించే అంశంపై ఉన్నతాధికారులు సమీక్షించనున్నారు. వేసవి సెలవుల్లో ప్రతి రోజు సర్వదర్శనం క్యూ లైన్ వెలుపలే ఉండే క్రమంలో సిఫార్సుపై లేఖలపై ఇచ్చే బ్రేక్ దర్శనాలను పూర్తిస్థాయిలో రద్దు చేసి బ్రేక్ దర్శనాన్ని కేవలం ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులకే పరిమితం చేసేలా నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

ఇన్విజిలేటర్‌ను బెదిరించిన యువకులపై పోలీసులకు ఫిర్యాదు

తిరుపతి(విద్య), మార్చి 27(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు కాపీకి పాల్పడకుండా అడ్డుకున్న ఓ ఇన్విజిలేటర్‌ను బెదిరించిన యువకులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు డీఈవో కేవీఎన్ కుమార్ గురువారం తెలిపారు. 'ఎస్ రామాపురం ఎంపీపీ స్కూల్ ఎస్జీటీ డి. మురుగేషన్ ఈనెల 24న పిచ్చాటూరు- ఎ సెంటర్ జడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో టెన్త్ పరీక్షలకు ఇన్విజిలేటర్‌గా పనిచేశారు. కాపీకి యత్నించిన విద్యార్థులను మందలించి.. అలాంటి అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. విధుల అనంతరం ఆయన తిరుగు ప్రయాణంలో కీలపూడి వద్ద కొందరు యువకులు ఆయన్ను అడ్డగించి బెదిరించారు. భయాందోళనకు గురైన మురుగేషన్ ఆస్పత్రిపాలయ్యారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయాలని పిచ్చాటూరు ఎంఈవోను ఆదేశించాం' అని డీఈవో వివరించారు. ఆ మేరకు ఆయన ఫిర్యాదు చేశారన్నారు. పదో తరగతి పరీక్షల్లో నిజాయితీగా విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు విద్యాశాఖ అండగా ఉంటుందని, ఎవరూ ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గరాదని డీఈవో స్పష్టం చేశారు.

కాలం చెల్లిన మందుల విక్రయం

● డ్రగ్స్ అధికారుల తనిఖీల్లో వెలుగుచూసిన వైనం
● మూడు షాపుల సీజ్ ● హోమియో మందుల షాపుపై కేసు నమోదు

పుత్తూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణంలోని ఆరు మెడికల్ షాపుల్లో గురువారం తిరుపతి డివిజన్ డ్రగ్స్ అధికారిణి రీతు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందుల నిర్వహణ సక్రమంగా చేపట్టకపోవడంతో మూడు షాపులను సీజ్ చేశారు. ఈ షాపుల్లో బిల్లులు ఇవ్వకుండా విక్రయించడం, ఫార్మసిస్టు లేకపోవడం, కాలం చెల్లిన మందులను విక్రయించడాన్ని గుర్తించారు. అదేవిధంగా షణ్ముగన్ హోమియో మెడికల్ షాపులో అనుమతులు లేని మూడు రకాల మందులను విక్రయిస్తుండటాన్ని గుర్తించారు. ఈ దుకాణంపై కేసు నమోదు చేసి కోర్టుకు నివేదించనున్నట్లు రీతు తెలిపారు. వీఆర్వో యశోద, ప్రభుత్వ ఫార్మసిస్టు అన్నాదొరై ఆమెకు సహకరించారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:27 (శుక్రవారం సాయంత్రం)
సహర్: 4:52 (శనివారం ఉదయం)

తిరుపతికి చేరిన 'గుండె'

తిరుపతి(వైద్యం), మార్చి 27(ఆంధ్రజ్యోతి): మరొకరికి గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేయడానికి గుంటూరు నుంచి 'గుండె'ను తీసుకొచ్చారు. గుంటూరులో రోడ్డు ప్రమాదానికి గురైన సుష్మ(48) బ్రెయిన్ డెడ్ కావడంతో.. ఆమె గుండెను తిరుపతిలోని శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 53 ఏళ్ల వ్యక్తికి అమర్చేందుకు చర్యలు చేపట్టరు. ఈ మేరకు శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తన బృందంతో వెళ్లి గుండెను సేకరించి గ్రీన్‌ఛానల్ ద్వారా ప్రత్యేక విమానంలో గురువారం రాత్రి 9.38 గంటలకు విమానాశ్రయానికి.. ప్రత్యేక అంబులెన్సులో 9.59 గంటలకు ఆస్పత్రికి తీసుకొచ్చారు. అప్పటికే గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేసేందుకు సిద్ధంగా ఉన్న వైద్య బృందం ఆ గుండెను ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లింది. ఈ శస్త్ర చికిత్స పూర్తయ్యేందుకు 6 నుంచి 8 గంటల సమయం పడుతుందని వైద్యులు తెలిపారు. ఇప్పటి వరకు 18 గుండె మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం 19వ గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేస్తున్నారు.



ఆస్పత్రి ముందు భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న పోలీసులు



అంబులెన్సులో నుంచి ఆస్పత్రిలోకి గుండెను తీసుకెళుతున్న వైద్య సిబ్బంది

ఎంపీపీ, రెండు ఉపసర్పంచుల ఎన్నిక ప్రశాంతం

● పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



నిర్మానుష్యంగా తిరుపతి రూరల్ ఎంపీడీవో కార్యాలయ పరిసరాలు

తిరుపతిరూరల్/చంద్రగిరి/ఎర్రావారిపాళెం, మార్చి27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం ఒక ఎంపీపీ, రెండు ఉపసర్పంచుల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎలాంటి ముందు చోట్లా పరిస్థితిని బట్టి పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. తిరుపతి రూరల్ ఎంపీపీగా వైసీపీకి చెందిన మూలం చంద్రమోహన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తమకు తగినంత సంఖ్యాబలం లేకపోవడంతో టీటీడీ తరఫున అభ్యర్థి పోటీలో లేరు. ఈ ఎన్నికల జరిగిన రూరల్ ఎంపీడీవో కార్యాలయం పరిసరాల్లో షాపులను మూయించేశారు. రాకపోకలను ఆపేశారు. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి ముంబైలో క్యాంపులో ఉన్న వైసీపీ ఎంపీటీసీ సభ్యులు ఉదయాన్నే విమానంలో దిగారు. ప్రత్యేక బస్సులో వచ్చి ఓటేశారు. ఇక, చంద్రగిరి మండలం రామిరెడ్డి పల్లె ఉపసర్పంచ్ ఎన్నికకు ఏడుగురు వార్డు సభ్యులు హాజరయ్యారు. వీరంతా టీడీపీ మద్దతుదారైన వెంకటరమణను ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు. ఇక, ఎర్రావారిపాలెం మండలం చింతగుంట ఉప సర్పంచ్‌గా వైసీపీ మద్దతుదారు జూపూడి అన్నపూర్ణ ఎన్నికయ్యారు.

ఆల్తూరుపాడు రిజర్వాయరుకు కొత్తగా ప్రతిపాదనలు

డక్కిలి, మార్చి 27 : (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలంలోని ఆల్తూరుపాడు రిజర్వాయరుకు కొత్తగా ప్రతిపాదనలు పంపనున్నట్లు తిరుపతి తెలుగుగంగ చీఫ్ ఇంజనీరు వరప్రసాద్ వెల్లడించారు. సోమశిల -స్వర్ణముఖి కాలువ నిర్మాణంలో భాగంగా ఆల్తూరుపాడు వద్ద రిజర్వాయరు నిర్మాణాన్ని 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రూ.400 కోట్ల అంచనాలతో రిజర్వాయరు నిర్మాణ పనులను ప్రారంభించింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ రిజర్వాయరు నిర్మాణ పనులను రీ టెండరు పేరుతో నిలిపివేసింది. తర్వాత టెండర్లు నిర్వహించినప్పటికీ 26 శాతం లెస్‌తో టెండర్ దక్కించుకొన్న ఓ కాంట్రాక్టరు పనులు పూర్తి చేస్తే నష్టం వస్తుందని భావించి ఆపేశారు. తర్వాత వైసీపీ ప్రభుత్వం రిజర్వాయరు నిర్మాణ పనులను గాలికొదిలేసింది. ప్రస్తుతం రిజర్వాయరు నిర్మాణం చేపడతామని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్ల సదస్సులో ప్రకటించారు. ఈ క్రమంలో రిజర్వాయరు నిర్మాణం కోసం అంచనాలను తిరిగి పంపమని ప్రభుత్వం ఆదేశించడంతో చీఫ్ ఇంజనీరు వరప్రసాద్ రిజర్వాయరు ప్రాంతాన్ని గురువారం పరిశీలించారు. ప్రస్తుత ఎస్ఎస్ఆర్ రేట్లు ప్రకారం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. దీంతో ఈ ప్రాంత రైతుల్లో రిజర్వాయరుపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో తెలుగుగంగ ఎస్ఈ రాధాకృష్ణారెడ్డి, ఈఈలు విజయకుమార్ రెడ్డి, రామచంద్రమూర్తి, అనిల్ కుమార్ రెడ్డి, విజయరామిరెడ్డి, డీఈ తిరుమలయ్య, బాబు తదితరులున్నారు.



స్మార్ట్ మీటర్ల ఒప్పందాలు రద్దు చేయండి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ -

తిరుపతి(ఆటోనగర్), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం చేసుకున్న స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మీటర్ రీడర్స్ సమస్యలపై సదరన్ డిస్కం కార్యలయం ఎదుట గురువారం చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు అమర్చడానికి అదానీ సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేస్తామని సీఎం చంద్రబాబు, నారా లోకేశ్ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ హామీని వెంటనే అమలు చేయకపోతే వేలాది మంది మీటర్ రీడర్లు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. స్మార్ట్ మీటర్లు అమరిస్తే రాష్ట్ర ప్రజలపై లక్షా పదివేల కోట్ల రూపాయలు భారం పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిని విస్తృతంగా ప్రోత్సహించాలన్నారు. అంతకుముందు బైరాగిపట్టెడలోని ఏఐటీయూసీ కార్యాలయం నుంచి సదరన్ డిస్కం కార్పొరేట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.మురళి,విశ్వనాథ్, రాధాకృష్ణ, చిన్నం పెంచలయ్య, సురేష్‌బాబు, జయమణి, హజరత్‌వలీ, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



డిస్కం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

ఇదేం తీరు?

పుంగనూరులో మంత్రి పర్యటన సందర్భంగా బయటపడ్డ ఎమ్మెల్యేల అసంతృప్తి



రామకృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

పుంగనూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేల అసంతృప్తి పార్టీ శ్రేణుల సాక్షిగా బయటపడింది. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం కృష్ణాపురంలో టీడీపీ కార్యకర్త రామకృష్ణను అక్కడి వైసీపీ కార్యకర్త వెంకట్రరమణ ఇటీవల నరికి చంపిన విషయం తెలిసిందే. గురువారం రామకృష్ణ పెద్దకర్మ కార్యక్రమం ఉండడంతో ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు వెళ్లి రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించాలని పార్టీ ఆదేశించింది. దీంతో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి విజయవాడ నుంచి బెంగళూరు చేరుకుని, అక్కడి నుంచి రోడ్డుమార్గంలో కృష్ణాపురానికి ఉదయం 9.50 గంటలకల్లా వెళ్లారు. ఉదయం 10 గంటలకు రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించాలనుకున్నా.. ఆ సమయానికి అక్కడికి జిల్లా ఎమ్మెల్యేలు చేరుకోలేదు. పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి మాత్రమే మంత్రికి ఆహ్వానం పలికారు. అప్పటి వరకు మంత్రి అదే గ్రామంలోని ఓ కార్యకర్త ఇంటి వద్ద ఉంటూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. చిత్తూరు, శ్రీకాళహస్తి, చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, బొజ్జల సుధీర్‌రెడ్డి, పులివర్తి నాని, మురళీమోహన్ పలమనేరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి అమరనాథ రెడ్డి ఇంటి వద్దకు చేరుకుని అక్కడే టిఫిన్ చేశారు. అక్కడి నుంచి బయల్దేరి 11.30 గంటలకు కృష్ణాపురం చేరుకున్నారు. అప్పటి వరకు మంత్రి వారి కోసం వేచి చూశారు. ఎమ్మెల్యేలు వస్తున్న సమయంలో మంత్రి పక్కనే ఉన్న చనిపోయిన రామకృష్ణ ఇంటి వద్దకు వెళ్లారు. ఎమ్మెల్యేలను నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆహ్వానించారు.తరువాత మంత్రి, ఎమ్మెల్యేలంతా రామకృష్ణ చిత్ర పటానికి నివాళులర్పించారు.ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. తర్వాత ముందే ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్ శిబిరం వద్దకు చేరుకోవాల్సి ఉండగా.. ఇన్‌ఛార్జి చల్లా అందర్నీ పిలిచారు. మంత్రి ప్రెస్‌మీట్ వద్దకు చేరుకుని ఎమ్మెల్యేల కోసం మళ్లీ 10 నిమిషాల పాటు వేచి చూశారు. తొలుత మంత్రి 3 నిమిషాలు మాట్లాడారు. ఎమ్మెల్యేల తరపున మాట్లాడాలని చిత్తూరు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని కోరారు. దీంతో ఆయన కోప్పడ్డారు. 'మంత్రి మాట్లాడేశారు కదా, నేను ఏందీ మాట్లాడేది' అని అక్కడి నుంచి లేచి వెళ్లిపోయారు. దీంతో అక్కడున్న మిగిలిన ఎమ్మెల్యేలు కూడా ప్రెస్‌మీట్‌లో మాట్లాడలేదు. ఎవరిపాటికి వాళ్లు వెళ్లిపోయారు. ఆఖరులో మంత్రి వెళ్లారు.వాస్తవానికి వైసీపీ ఐదేళ్ల పాలనలో పుంగనూరులో టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీ అగ్ర నేత పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి వర్గీయుల చేతిలో నలిగిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా టీడీపీ కార్యకర్తను వైసీపీ కార్యకర్త హత్య చేయగలిగాడంటే అక్కడి పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో పుంగనూరుకు ఎమ్మెల్యేలంతా వెళ్లి కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం నింపాలని పార్టీ అధినేత చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి లోకేశ్ సూచించారు. కానీ, పుంగనూరులో గురువారం జరిగిన ఎమ్మెల్యేల తీరు భరోసా కంటే నిరుత్సాహాన్నే మిగిల్చింది. కార్యకర్తల్లో భరోసా నింపుతారనుకుంటే అంతర్గత విభేదాలు బయటపెట్టుకున్నారని స్థానిక టీడీపీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. కాగా, టీడీపీకి పునాదులైన కార్యకర్తలను కాపాడుకునేందుకు ఎంతదూరమైనా వెళతామని ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. ఎమ్మెల్యేలు, నేతలతో కలిసి ఆయన రామకృష్ణ ఇంటివద్ద ఏర్పాటు చేసిన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన భార్య ఉమాదేవి, కుమారులు శివ, సురేశ్ కుమార్‌లతో మాట్లాడి వారి పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

ఇంకుడు గుంతలతో వర్షపునీరు ఆదా


ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న శ్రీనివాసరెడ్డి

భాకరాపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వర్షపు నీరు వృథాగా పోకుండా భూమిలోకి ఇంకేలా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు రెడ్డి అన్నారు. మండలంలో ప్రభుత్వ భవనాలు వద్ద ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భవనాలపైన పడే వర్షపు నీరు భూములోకి ఇంకేలా చేయడం వల్ల భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయన్నారు. దాని వల్ల తాగునీటి కొరత ఉండదన్నారు. ఏఈ కృష్ణారెడ్డి, స్వచ్ఛ భారత్ కో-ఆర్డినేటర్ గిరిబాబు, పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాల పంపిణీ



భాకరాపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు పంచాయతీలోని పారిశుధ్య కార్మికులకు నిత్యావసర వస్తువులు, వస్త్రాలను పంపిణీ చేసినట్లు ఈవోపీఆర్‌ఆర్‌డీ సోమశేఖరరెడ్డి తెలిపారు. ప్రజలకు సేవ చేస్తున్న ఈ కార్మికుల సేవలను గుర్తించి పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి గిరిబాబు, సర్పంచ్ మనోహర పాల్గొన్నారు.

రిటైర్డ్ గణిత ఉపాధ్యాయుడికి సన్మానం



రామచంద్రాపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గణిత ఉపాధ్యాయుడు మురళి సేవలు ప్రశంసనీయమని ఎంఈవో జయవేలు, ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి కొనియాడారు. కమ్మకండ్రిగలోని చేకూరి నాగమనాయుడు ఎర్రమ్మ జడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు మురళి గురువారం రిటైరయ్యారు. ఈ సందర్భంగా మురళి దంపతులను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర భాషోపాధ్యా సంస్థ జిల్లా అధ్యక్షుడు దొడ్డ ఉమామహేశ్వర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు వాగ్దేవి, సర్పంచ్ వేణుగోపాల్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకరయ్య, జగన్నాథం, చిట్టిబాబు పాల్గొన్నారు.

శబ్ధ కాలుష్య వాహనాలకు రూ.35 వేల జరిమానా


జీఎన్సీ వద్ద తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

తిరుమల, మార్చి27(ఆంధ్రజ్యోతి): తిరుమలలో పర్యావరణాన్ని దెబ్బతీసేలా శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న వాహనాలకు రూ.35 వేల జరిమానా విధించారు. జీఎన్సీ వద్ద ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అధిక 35 వాహనాలను గుర్తించి ట్రాన్స్‌పోర్టు విభాగానికి అప్పగించారు. రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. తిరుమలకు వచ్చే వాహనాలన్నీ పూర్తిస్థాయిలో కండీషన్‌లో ఉండాలని, నిబంధనల ప్రకారం పత్రాలు ఉండాలని ట్రాఫిక్ పోలీసులు ఆదేశించారు.

దళారుల నుంచి రైతులను కాపాడండి


సమావేశంలో మాట్లాడుతూన్న కె.ప్రభాకర్‌రెడ్డి

తిరుపతి (ఆటోనగర్), మార్చి 27(ఆంధ్రజ్యోతి): దళారుల నుంచి రైతులను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. తిరుపతి యశోదనగర్‌లోని వేమన విజ్ఞానభవన్‌లో గురువారం రైతు సంఘ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. చెరకు రైతుల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వరి పంటకు గిట్టుబాటు ధర ప్రకటించి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. మయూరా షుగర్స్ యాజమాన్యం రైతులకు బకాయిలు చెల్లించకపోవడంపై మండిపడ్డారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రంగయ్య, హేమలత, రైతులు పాల్గొన్నారు. అనంతరం రైతు సంఘం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రంగయ్య, కార్యదర్శిగా పి.హేమలత, 14 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చైతన్యలో ఘనంగా కిడ్స్ కాన్వొకేషన్ డే


విద్యార్థులతో డాక్టర్ నిరుపమ, ప్రిన్సిపాల్ జయప్రకాశ్, వైస్ ప్రిన్సిపాల్ కిశోర్‌బాబు

తిరుపతి(విద్య), మార్చి27(ఆంధ్రజ్యోతి): జీఎస్ మాడవీధిలోని శ్రీచైతన్య స్కూల్‌లో యూకేజీ విద్యార్థుల కిడ్స్ కాన్వొకేషన్ డేని గురువారం ఘనంగా నిర్వహించారు. పలువురు యూకేజీ చిన్నారులు కాన్వొకేషన్ దుస్తులు ధరించి సర్టిఫికెట్లని తీసుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన గైనకాలజిస్ట్ డాక్టర్ నిరుపమ మాట్లాడుతూ చిన్నారుల మనోభావాలను తల్లిదండ్రులు అర్థం చేసుకుని వారి ఎదుగుదలకు తోడ్పాటునందించాలని తెలిపారు. ఏజీఎం సురేష్, ప్రిన్సిపాల్ జయప్రకాశ్, వైస్ ప్రిన్సిపాల్ కిశోర్‌బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ బాలాజీ, జోనల్ అకడమిక్ డీన్ సురేష్, సీఅండ్ఎం ఇన్‌చార్జి నరేంద్రబాబు, ప్రైమరీ ఇన్‌చార్జి అర్చన, నందన పాల్గొన్నారు.

టౌన్‌బ్యాంకు మొండి బకాయిలు రూ.11కోట్లు

● అవకతవకలకు పాల్పడ్డారంటూ ఇద్దరి సస్పెన్షన్

తిరుపతి(ఆటోనగర్), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి టౌన్‌బ్యాంక్‌లో మొండి బకాయిలు రూ.11కోట్లు పేరుకుపోయాయి. వీటి వసూలు.. కొన్నింటిని మాఫీ చేయడంపై అవకతవకలకు పాల్పడ్డారన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఇద్దరు సస్పెండయ్యారు. ఈ విచారణ పూర్తిస్థాయిలో జరిగే మరెంత మందిపై చర్యలు ఉంటాయోనన్న ప్రచారం జరుగుతోంది. వందేళ్ల చరిత్ర గల టౌన్‌బ్యాంకు రూ.500 కోట్ల లావాదేవీలతో నడుస్తోంది. ఇప్పటి వరకు రూ.235 కోట్ల రుణాలు మంజూరు చేసింది. ఇందులో రూ.11కోట్ల మొండి బకాయిలున్నాయి. వీటి రికవరీకి కొంత మంది సిబ్బందిని ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసింది. వీటి వసూళ్లలో ఛీఫ్ మేనేజరు వి.వెంకటేశన్, పి.వినోద్‌బాబు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వచ్చాయి. కొందరు వాటాదారులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణకు సహకార శాఖ నుంచి కొంత మంది అధికారులను నియమించగా, వారు బకాయిల వసూళ్ల లెక్కలను పరిశీలిస్తున్నారు. మరోవైపు టౌన్ బ్యాంక్‌లో అక్రమాలు జరిగాయని, నష్టాల ఊబిలోకి వెళ్ళే ప్రమాదముందని ఆర్‌బీఐ అధికారులకు కొందరు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో ఒక ఏజీఎం, మరో అధికారిని ఆర్బీఐ పంపింది. వీరు మొండి బకాయిల వసూళ్లలో ఆరు వ్యాపార రుణాలకు సంబంధించిన అంశంలో అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని ఆర్‌బీఐ ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వీరి ఆదేశాలతో వెంకటేశన్, వినోద్‌బాబును సస్పెండ్ చేసినట్లు బ్యాంక్ ఎండీ వి.శివకుమార్‌రెడ్డి తెలిపారు. బ్యాంకులో మొండి బకాయిల అంశానికి సంబంధించి విచారిస్తున్న అధికారి పెంచలయ్యను వివరణ కోరగా.. వసూళ్లకు సంబంధించి రికార్డులు పరిశీలిస్తున్నామని చెప్పారు. కాగా, మొండి బకాయిల వసూళ్లలోనే కాదు.. రుణాల మంజూరులోనూ అవకతవకలు జరిగి ఉంటాయని కొందరు వాటాదారులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

చంద్రగిరి

ప్రశాంతంగా రూరల్ మండల ఎంపీపీ ఎన్నిక

● ముంబై నుంచి వైసీపీ సభ్యులు ఎన్నిక కేంద్రానికి చేరిక ● ఏకగ్రీవంగా ఎన్నికైన ఆ పార్టీ సభ్యుడు చంద్రమోహన్


ఎంపీపీగా ధ్రువపత్రం అందుకుంటున్న చంద్రమోహన్‌రెడ్డి

తిరుపతిరూరల్, మార్చి27(ఆంధ్రజ్యోతి): ముంబై క్యాంప్ రాజకీయం ముగించుకుని రూరల్ మండల ఎంపీటీసీలు గురువారం ఎంపీపీ ఎన్నికకు హాజరయ్యారు. పటిష్ట పోలీసు బందోబస్తు నడుమ రూరల్ మండల ఎంపీపీ ఎన్నిక గురువారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 11గంటలకు మండల ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల అధికారి జుబేదా అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వైసీపీకి చెందిన 33మంది, ఇండిపెండెంట్ ఎంపీటీసీ(తేజశ్వి) హాజరయ్యారు. ముగ్గురు గైర్హాజరయ్యారు. పేరూరు ఎంపీటీసీ సభ్యుడు మూలం చంద్రమోహన్‌రెడ్డి ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఇటీవల వైసీపీకి చెందిన ఎంపీటీసీలు ముంబై వెళ్లిన సంగతి తెలిసిందే. వీరు గురువారం ఉదయం తిరుపతి విమానాశ్రయానికి చేరుకుని పోలీసు భద్రత మధ్య బస్సులో తుమ్మలగుంటలోని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నివాసానికి వెళ్లారు. తర్వాత అక్కడి నుంచి పోలీసు ఎస్కార్ట్‌తో బస్సులో ఎన్నిక జరిగే ప్రాంతానికి చేరుకున్నారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం పోలీసులు పటిష్ట భద్రత నడుమ ఎన్నిక నిర్వహించారు.


రామిరెడ్డిపల్లె ఉపసర్పంచ్‌గా ప్రమాణం చేస్తున్న వెంకటరమణ- ఉపసర్పంచ్, వార్డు సభ్యులను సన్మానిస్తున్న టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు

ఉపసర్పంచ్ టీడీపీ కైవసం

చంద్రగిరి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రామిరెడ్డి పల్లె ఉపసర్పంచ్‌గా టీడీపీ మద్దతుదారు వెంకటరమణ ఏకగ్రీవకంగా ఎన్నికయ్యారు. పంచాయతీలో 8 మంది వార్డు సభ్యులుండగా ముగ్గురు టీడీపీ మద్దతుదారులు. ఐదుగురు వైసీపీ మద్దతుదారులు. వైసీపీ సభ్యులు ఇటీవల టీడీపీలో చేరారు. ఈక్రమంలో గురువారం పంచాయతీ కార్యాలయంలో ఏడుగురు సభ్యులు హాజరయ్యారు. టీడీపీ మద్దతుదారుడు వెంకటరమణను ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన గొడవల నేపథ్యంలో డీఎస్పీ ప్రసాద్, సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐలు రామకృష్ణ, అనిత, సిబ్బంది, రామిరెడ్డిపల్లె గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు ఉపసర్పంచ్, వార్డు సభ్యులను పూలమాలతో ఘనంగా సత్కరించారు. వైసీపీ సభ్యుల చేరికలో .టీడీపీ నాయకులు మురళీధర్‌నాయుడు, నాగరాజానాయుడు కీలకపాత్ర పోషించారు.

చింతగుంట ఉప సర్పంచ్‌గా అన్నపూర్ణ


జూపూడి అన్నపూర్ణ

ఎర్రావారిపాలెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చింతగుంట గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా వైసీసీ మద్దతురారు జూపూడి అన్నపూర్ణ ఎన్నికయ్యారు. 2023లో బాలాజీ నాయుడు రాజీనామా చేయడంతో ఏర్పడంతో గురువారం ఎన్నిక జరిగింది. పది మంది వార్డు సభ్యుల్లో ఒకరు హాజరుకాలేదు. 8 మంది అన్నపూర్ణకు మద్దతు తెలిపారు. ఎన్నిక సందర్భంగా సీఐ ఇమ్రాన్ భాషా ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

అమ్మవారి సేవలో ప్రభుత్వ సలహాదారు సతీష్‌రెడ్డి



తిరుచానూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి):పద్మావతి అమ్మవారిని గురువారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయం వద్ద అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఉన్నారు. సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చలపతి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, మార్చి27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఎంఎల్సీ దువ్వారపు రామారావు గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్న ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు. తిరుపతి డిప్యూటీమేయర్ ఆర్సీ మునికృష్ణ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

కేజీబీవీ కాలేజీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎర్రావారిపాలెం, మార్చి 27(ఆంధ్రజ్యోతి); మండల కేంద్రంలోని కేజీబీవీ కళాశాలలో ఇంటర్‌మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పరిమళ గురువారం ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే 6వ తరగతిలో ప్రవేశాలకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న వారు అర్హులన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 95152 86574 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఎస్పీకి ఉగాది సమ్మేళన ఆహ్వానం


ఎస్పీని అభినందిస్తున్న టీటీడీ క్షత్రియ సంఘం నాయకులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినం సందర్భంగా నిర్వహిస్తున్న సమ్మేళనానికి హాజరు కావాలని ఎస్పీ, టీటీడీ సీవీఎస్‌వో హర్షవర్ధన రాజుకు టీటీడీ క్షత్రియ సంఘం నాయకులు ఆహ్వానం పలికారు. గురువారం సంఘం వ్యవస్థాపకుడు రుక్మాందరరాజు, రుద్రరాజు గురుప్రసాద్‌రాజు, భాస్కరరాజు, సుకుమార్ ఎస్పీని కలసి ఆహ్వానించారు. ●తిరుపతి(కల్చరల్), మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుపతిలోని తెలుగు సాహితీ సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం ఉగాది వేడుకలు నిర్వహించనున్నారు. బైరాగిపట్టెడలోని రాఘవేంద్రనగర్ సాయిదుర్గ కల్యాణ మండపంలో సాయంత్రం 5 గంటలకు ప్రారంభమవుతాయి.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో సురేంద్ర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విద్యార్థులకు, ఉద్యోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందించారు.

లైంగిక దాడి కేసులో ఐదేళ్ల జైలు

● రూ.22వేల జరిమానా

నెల్లూరు (లీగల్), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ కేసులో కార్యం అంకయ్య అనే నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.22 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారి సిరిపిరెడ్డి సుమ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు, నాయుడుపేటలోని శ్రీరాం నగర్‌లో 2019 ఏప్రిల్ 28న తొమ్మిదేళ్ల బాలిక ఆడుకుంటుండగా నిందితుడు అంకయ్య ఆ బాలికను తన ఇంటిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. నాయుడుపేట పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీ చంద్రశేఖర్ వాదించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం


ప్రమాదస్థలంలో ఆషిక్ మృతదేహం


ప్రమాదంలో నుజ్జు నుజ్జయిన కారు


మృతి చెందిన శ్రీహరిరెడ్డి

చంద్రగిరి/పాకాల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. చంద్రగిరి పోలీసుల కథనం మేరకు బెంగళూరు విజయనగరకు చెందిన శ్రీహరిరెడ్డి(51) గురువారం తన కుమార్తె లోకికారెడ్డితో కలిపి కారులో నెల్లూరు వెళ్తున్నారు. అగరాల సమీపంలోకి రాగానే కుక్క అడ్డంగా రావడంతో కారు అదుపు తప్పి పల్టీలు కొడుతూ బోల్తా పడింది. శ్రీహరిరెడ్డికి తీవ్ర గాయాలవ్వడంతో స్విమ్స్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. లైకికారెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పాకాల మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతిచెందాడు. దామలచెరువు ఆజాద్ నగర్‌కు చెందిన కె.ఆషిక్ (18) ఇంజనీరింగ్ చదువుతున్నాడు. గురువారం ఉదయం 7 గంటలకు ద్విచక్ర వాహనంపై పాకాల వైపు వస్తూ కుక్కలపల్లె రైల్వే గేటు సమీపంలో పుంగనూరు వైపు వెళ్తున్న ఆర్టీసీ హైయ్యర్ బస్సును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆషిక్ అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ సుదర్శన ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి హామీ సిబ్బందికి రూ.1.49లక్షల జరిమానా

● డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్


ఆడిట్ నివేదికను పరిశీలిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్

రామచంద్రాపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ పనుల మస్టర్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, కొలతల్లో తేడాలు రావడంతో సిబ్బందికి రూ.1.49లక్షల మేర జరిమానా విధించినట్లు డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి నరేగాలో రూ.9 కోట్లతో 775 పనులను చేయించినట్లు తెలిపారు. పనుల కన్నా ఎక్కువ చెల్లించినట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించిందన్నారు. దీంతో ప్రభుత్వానికి రూ.11వేలు చెల్లించాలని సిబ్బందిని పీడీ ఆదేశించారు. అలాగే రూ.1.49లక్షలు జరిమానా విధించామన్నారు. వేసవి దృష్ట్యా ఉపాధి పనులను ఉదయం 6నుంచి 11గంటల లోపు ముగించలన్నారు. పనుల వద్ద కూలీలకు తాగునీరు, ప్రథమ చికిత్స బాక్సులు ఏర్పాటు చేయాలన్నారు. బహిరంగ సభలో డ్వామా విజిలెన్సు అధికారి శివయ్య, ఎంపీడీవో ఇందిరమ్మ, ఏపీడీ రెడ్డెప్ప, జేఈ మమత, నాగరాజు, సుదర్శన్, మురళి పాల్గొన్నారు.

'తొక్కిసలాట' ఘటనపై 2న నాలుగో దశ విచారణ ప్రారంభం

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 27(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శ్రీవారి వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ ప్రక్రియలో జరిగిన 'తొక్కిసలాట' ఘటనకు సంబంధించి ఏప్రిల్ 2న ఏక సభ్య న్యాయవిచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తిచే నాలుగో దశ విచారణ ప్రారంభం కానుంది. దీనికోసం జస్టిస్ సత్యనారాయణమూర్తి ఏప్రిల్ 1న తిరుపతికి రానున్నారు. కాగా, ఈ ఘటనకు సంబంధించి సస్పెండైన నాటి క్రైమ్ డీఎస్పీ రమణకుమార్.. తనకు కొంత సమయం కావాలని మూడో దశ విచారణలో కమిషన్‌ను అభ్యర్థించారు. అందులో భాగంగా ఏప్రిల్ 2న కలెక్టరేట్ వేదికగా జరిగే విచారణకు హాజరు కావాలని రమణకుమార్‌కు కమిషన్ నోటీసులు పంపింది. అక్కడ విధుల్లో ఉండి పార్కు గేట్లు తెరవడంతో తీవ్ర తొక్కిసలాటకు కారణమైందన్న ఆరోపణలతో సస్పెండైన రమణకుమార్ వాంగ్మూలం కీలకంగా మారనుంది. ఇదే సమయంలో కలెక్టర్ వెంకటేశ్వర్, టీటీడీ ఈవో శ్యామలరావు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో పాటు నాటి ఎస్పీ సుబ్బరాయుడు, అప్పటి జేఈవో గౌతమి, అప్పటి సీవీఎస్వో శ్రీధర్ సైతం విచారణకు మళ్లీ హాజరు కావాలని ఏకసభ్య కమిషన్ గురువారం నోటీసులు పంపినట్లు తెలిసింది. వచ్చే నెల 2, 3 తేదీలలో జరిగే నాలుగో దశతో విచారణ పూర్తయ్యే అవకాశం ఉంది.

అంతరిక్ష పరిశోధనల్లో భారతావని ముందంజ


జ్యోతిని వెలిగిస్తున్న సతీష్‌రెడ్డి

తిరుపతి రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): డిఫెన్స్ అంతరిక్ష పరిశోధనలో దేశం అగ్రరాజ్యాలతో పోటీపడుతూ ముందంజలో ఉందని డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి తెలిపారు. తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లెకి చెందిన సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల 16వ వార్షికోత్సవాన్ని గురువారం మహతి ఆడిటోరియంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని సాధనకు ప్రణాళికలు ఆచరించాలని తెలిపారు. సాంకేతికపరంగా కూడా అగ్రదేశాలతో సరిసమానంగా ఉన్నామని తెలిపారు. టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ సమయపాలన, క్రమశిక్షణ జీవితంలో ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని చెప్పారు. కళాశాల చైర్మన్ వై.కొండారెడ్డి మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర గురించి వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల సెక్రటరీ వై.ఆనందరెడ్డి, వైస్ చైర్మన్ వై.విజయ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే కఠిన చర్యలు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 27(ఆంధ్రజ్యోతి): తిరుపతికి వచ్చే భక్తులు, పర్యాటకులు, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవని తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అన్నారు. ఫుడ్‌సేఫ్టీ అధికారులు జిల్లా వ్యాప్తంగా పలు హోటల్స్, వ్యాపారస్థులపై నమోదు చేసిన కేసుల వివరాలను గురువారం ఆయన వివరించారు. ఎవరెవరికి ఎంత జరిమానా విధించారో తెలిపారు. ప్రతి ఒక్క ఆహార పదార్థాలు అమ్మేవారు, తయారీదారులు, హోటల్స్‌లో విక్రయించే పదార్థాలలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. అదే విధంగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ లైసెన్సు కలగి ఉండాలని తెలిపారు. లేని పక్షంలో రూ.10లక్షల వరకు జరిమానా విధిస్తారన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల మరింత ఉధృతంగా దాడులు చేసి ప్రజలు, భక్తుల ఆరోగ్యమే ప్రధానంగా కల్తీలు, నకిలీల ఆహార పదార్థాలను తయారు చేసేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మద్దిలేటి, అధికారులు జగదీష్, నర్మద సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల పరిశీలన

● కెమెరాలతో చిత్రీకరణ

సత్యవేడు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు తహసీల్దార్ కార్యాలయంలోని పురాతన రెవెన్యూ రికార్డులను సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయానికి చెందిన అధికారుల బృందం గురువారం పరిశీలించారు. మరోవైపు ఈ రెవెన్యూ రికార్డుల పరిశీలను కెమెరాలతో చిత్రీకరించడం చర్చనీయాంశంగా మారింది. కార్యాలయంలోని రికార్డుల గదిలో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన రికార్డులను బూజు దులిపి అణువణువు క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు నమోదు చేయడం గమనార్హం. రెవెన్యూ రికార్డులను పరిశీలనపై పలు వాదనలు వినిపిస్తున్నాయి.

ఇటీవల శ్రీసిటీ పరిధిలో పారిశ్రామిక అవసరాల కోసం మండలంలోని ఇరుగుళం, కొల్లడం, పెద్దఈటి పాకం, రాళ్లకుప్పం గ్రామాల్లో 2500 ఎకరాలను సేకరించేందుకు ఏపీఐఐసీ ఇటీవల నోటిఫికేషన్ .జారీ చేసింది. ఈ నేపథ్యంలో భూసేకరణలో గతంలో మాదిరిగా అవకతవకలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ముందుగా ఆయా గ్రామాల్లో రికార్డులను పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే రెవెన్యూ అధికారులు మాత్రం అలాంటిదేమీ లేదని, రికార్డులు పాతబడి పోయి ఎండకు ఎండి, వానకు తడిసి చిరిగి పోతుండడంతో వాటిని క్రమబద్ధీకరిస్తున్నట్లు చెబుతున్నారు.

ధ్వజారోహణంతో కోదండరాముడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


పెద్దశేష వాహనంపై శ్రీరామచంద్రమూర్తి

తిరుపతి(టీటీడీ), మార్చి 27(ఆంధ్రజ్యోతి): కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ముందుగా సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి, ధ్వజపటం, చక్రత్తాళ్వారులకు తిరువీధి ఉత్సవం, ఆస్థానం నిర్వహించారు. అనంతరం అర్చకుల వేదమంత్రోచ్ఛారణలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ గరుత్మంతుడి చిత్రంతో కూడిన ధ్వజపటాన్ని మేషలగ్నంలో సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజారోహణ ఘట్టాన్ని పూర్తి చేశారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి ఉత్సవర్లకు వేడుకగా స్నపన తిరుమంజనం జరిగింది. సుగంధ ద్రవ్యాలతో స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేశారు. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు పెద్దశేష వాహనం పై కొలువుదీరిన స్వామివారు ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, తిరుమల ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, టీటీడీ ఆగమ సలహాదారు సీతారామాచార్యులు, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకరన్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



కోయిల్ ఆళ్వార్ తిరుమంజనంలో పాల్గొన్న ఆలయాధికారులు

తిరుపతి (కల్చరల్), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈనెల 30న ఆలయంలో ఉగాది ఆస్థానం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఆలయ ప్రాంగణంలోని గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేశారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి, పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీ గడ్డ తదితర సుగంధ ద్రవ్యాలతో కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, సూప రింటెండెంట్ చిరంజీవి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

నరసింహ యాదవ్ ప్రమాణ స్వీకారానికి తరలిరండి

తిరుపతి(కల్చరల్), మార్చి 27(ఆంధ్రజ్యోతి): విజయవాడ తుమ్మపల్లి కళాక్షేత్రంలో ఏప్రిల్ 2వ తేదీన యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా గొల్ల నరసింహయాదవ్ ప్రమాణస్వీకారోత్సవానికి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని బీసీ సంఘ నాయకుడు జగన్నాథం కోరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడారు.

సరళమైన సంస్కృతంలో అన్నమయ్య సంకీర్తనలు



సాహితీ సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

తిరుపతి (కల్చరల్), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సరళమైన సంస్కృతంలో తెలుగు వారికి అర్థమయ్యేలా అన్నమయ్య సంకీర్త నలు రచించినట్లు ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ స్కూల్ అధ్యాపకురాలు సుహాసిని పేర్కొన్నారు. అన్నమయ్య 522వ వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో గురువారం సాహితీ సదస్సులు ప్రారంభమయ్యాయి. ఎస్వీ విశ్వవిద్యాలయం విశ్రాంతాచార్యులు దామోదర నాయుడు అన్నమయ్య - వేంకటేశ్వర శతకంపై మాట్లాడారు. గుంటూరు జిల్లా లేమల్లపాడు ఎంటీఎస్ పాఠశాల డైరెక్టర్ రవికృష్ణ వేంకటేశ పదములతో విశేషాంశములు అనే అంశంపై ప్రసంగించారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు, స్థానిక కళాకారుల సంగీత సభ, హరికథ గానం ఆకట్టుకుంది.

వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న ముస్లిం ఐక్యవేదిక నేతలు

తిరుపతి (కల్చరల్), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్ షలి డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో తిరుపతి పెద్ద మసీదు వద్ద గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులను కాజేయాలని కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా సవరణ బిల్లును తీసుకొచ్చిందని, వెంటనే వెనక్కి తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్నారు. కార్యక్రమంలో ముస్లింలు, వామపక్ష నాయకులు పాల్గొన్నారు.

రామ్‌చరణ్ ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటుడు రామ్ చరణ్ ఉన్నత శిఖరాలను అధిరోహించా లని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆకాంక్షించారు. రామ్‌చరణ్ జన్మదినం సందర్భంగా గురువారం మధ్యాహ్నం రుయా ఆస్పత్రి వద్ద అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ప్రారంభించారు. రామ్‌చరణ్‌కు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆ భగవంతుడిని ప్రార్థించానన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, రామ్‌చరణ్ యువశక్తి సభ్యులు పగడాల మురళి, కేఎంకే లోకేశ్, సాయి, రుద్రకిషోర్, తులసి, సుధా పాల్గొన్నారు.

కళలపై సబ్జెక్టు పెట్టాలి

తిరుపతి(కల్చరల్), మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రతి తరగతిలో కళలపై సబ్జెక్టు పెట్టాలని రచయిత రాసాని వెంకటరామయ్య అన్నారు. తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో గురువారం ప్రపంచ నాటక దినోత్సవాన్ని నిర్వహించారు. పలువురు ప్రముఖులు మాట్లాడుతూ వీధి నాటక కళాకారులకు తమిళనాడు తరహా పెన్షన్ ఇవ్వాలన్నారు. పద్యాలు, పాటలు, నాటికలు ప్రదర్శించారు. కార్యక్రమంలో మల్లేశ్వరరావు, రామచంద్రారెడి, నాగార్జున పాల్గొన్నారు.

రుయాలో అవకతవకలపై కలెక్టర్ జోక్యం చేసుకోవాలి

తిరుపతి(ఆటోనగర్), మార్చి 27(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై కలెక్టర్ జోక్యం చేసుకోవాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వేణు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అందించిన వైద్యులకు ప్రభుత్వం ప్రోత్సాహం కింద ఇచ్చిన రూ.14.55 లక్షలను హెచ్‌వోడీ స్వాహా చేసినట్లు ఆరోపణలు వచ్చాయని, దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా ప్రపంచ రంగస్థలి దినోత్సవం

తిరుపతి(కల్చరల్), మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రపంచ రంగస్థలి దినోత్సవాన్ని గురువారం తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. నటరాజ స్వామివారికి పూజలు నిర్వహించి, నాటక రంగంలో ప్రతిభచాటిన వారిని సత్కరించారు. కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథరెడ్డి, కేఎస్ రాజా, పద్మనాభం, సుబ్రహ్మణ్యం రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కేశవుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్ మృతిపై విచారణ చేపట్టాలి

తిరుపతి(కల్చరల్), మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రముఖ క్రైస్తవ ప్రబోధకుడు ప్రవీణ్ పగడాల మృతి యావత్తు క్రైస్తవ సమాజాన్ని శోకసంద్రంలో ముంచేసిందని తిరుపతి పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ అరుల్ అరసు అన్నారు. తిరుపతిలోని షెకీనా ప్రార్థన మందిరంలో గురువారం ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ మృతిపై పలు అనుమానాలున్నాయని, ప్రభుత్వం విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలని డిమాండ్ చేశారు.

ప్రతిభతోనే మనిషికి అసలైన విలువ

అఖిల భారత సంస్కృత విద్యార్థుల ప్రతిభా ఉత్సవాల్లో వక్తలు



ఉత్సవాలను ప్రారంభిస్తున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మనిషిని ప్రతిభ ఒక్కటే సమున్నత స్థాయిలో నిలపగలదని పలువురు వక్తలు పేర్కొన్నారు. జాతీయ సంస్కృత యూనివర్సిటీలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న అఖిల భారత సంస్కృత విద్యార్థుల ప్రతిభా ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. సంస్కృత అకాడమీ డైరెక్టర్ ప్రొఫెసర్ పెన్నా మధుసూదనరావు మాట్లాడుతూ దేశంలో సంస్కృత విజ్ఞానవ్యాప్తిలో జాతీయ సంస్కృత యూనివర్సిటీ మొదటి స్థానంలో ఉందన్నారు. సంస్కృత విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో నిర్వహించే ఈ కార్యక్రమం విశిష్టమైందన్నారు. సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయడానికే ఈ పోటీలు చేపట్టినట్టు తెలిపారు. త్వరలో కొవ్వూరు, వరంగల్ ప్రాంతాల్లో సంస్కృత ఆఫ్ క్యాంపస్‌లను ప్రారంభిస్తామన్నారు. రిజిస్ట్రార్ కె.వెంకటనారాయణరావు మాట్లాడుతూ పోటీలో పాల్గొనడమే విజయానికి తొలిమెట్టు అని చెప్పారు. సుమారు 20 యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహాత్మా గాంధీ జీవిత చరిత్ర ఆధారంగా వీసీ కృష్ణమూర్తి రాసిన 'సంకల్ప బలం' అనే లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రంగనాథన్, దక్షిణామూర్తిశర్మ, సత్యనారాయణాచార్య, లత, గోవింద త్రిపాఠి, పీఆర్వో రమేష్, ఏపీఆర్వో కనపాల కుమార్, నారాయణ, లీనాచంద్ర పాల్గొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో 10 మందికి జైలు శిక్ష, జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో 10 మందికి ఆరు నెలల జైలుశిక్ష, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి గురువారం తీర్పునిచ్చారు. అటవీ శాఖ జిల్లా లైజన్ అధికారి హరిప్రసాద్ చెప్పిన వివరాల మేరకు... తమిళనాడు రాష్ట్రం శోళింగర్‌కు చెందిన కె.రవి, పి.విజయకుమార్, ఆర్‌కే పేటకు చెందిన చిన్నప్పన్, మాంబాకం సత్రానికి చెందిన పురుషోత్తమరాజు, పోలూరు తాలూకా పుదూరు గ్రామానికి చెందిన వెంకటేష్, చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురం మండలం దిగువ రిపుంజరాజపురానికి చెందిన సూలగళ్ల శోభన్‌బాబు, ఆర్ముగం, దిగువ ముదికుప్పం హరిజనవాడకు చెందిన రామారావు, సుబ్రహ్మణ్యం, మునస్వామి 2014లో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ అటవీశాఖ అధికారులకు పట్టుబడ్డారు. ఎస్ఆర్‌పురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి, పుత్తూరు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి 10 మంది నిందితులకు ఆరునెలల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ అప్పట్లో తీర్పు చెప్పారు. దీనిపై నిందితుల తరపు న్యాయవాది తిరుపతి ఎర్రచందనం ప్రత్యేక న్యాయస్థానంలో అప్పీలుకు వెళ్లారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి కింది కోర్టు తీర్పును యథావిధిగా అమలు చేయాలని తీర్పు ఇచ్చారు.

ఇండస్ట్రియల్ కారిడార్ పెండింగ్ పనులను పూర్తి చేయాలి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 27(ఆంధ్రజ్యోతి): వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, సీబీఐసీ అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జేసీ శుభం బన్సల్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులకు సంబంధించిన వాటర్ పైప్‌లైన్ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. చెన్నై-బెంగళూరు కారిడార్ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణపై అధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఆర్డీవో కిరణ్మయి, తిరుపతి ఏపీఐఐసీ జోనల్ మేనేజరు విజయ్ భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్టీకి పనిచేసే అవకాశమివ్వండి



మంత్రి లోకేశ్‌కు పుస్తకాలు అందజేస్తున్న శివప్రీతమ్

తిరుపతి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మాజీ ఎంపీ దివంగత డాక్టర్ ఎన్.శివప్రసాద్ మనవడు కేతన్ శివప్రీతమ్ గురువారం మంత్రి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. నారా దేవాన్ష్‌ను లోకేశ్ ఆత్మీయంగా ముద్దాడే కవర్ ఫొటోలతో ఉన్న పుస్తకాలను అందజేశారు. మూడు దశాబ్దాలకు పైగా తమ కుటుంబం టీడీపీకి సేవలందిస్తోందని, ఇప్పుడూ కొనసాగిస్తున్నామని ప్రీతమ్ గుర్తు చేశారు. లోకేశ్ స్పందిస్తూ టీడీపీలో కష్టపడే యువతకు మంచి అవకాశాలు వస్తున్నాయని, ఆ దిశగా పనిచేయాలని చెప్పినట్లు తెలిసింది.

సీకాం డిగ్రీ కళాశాలకు న్యాక్ గుర్తింపు



సర్టిఫికెట్ అందుకుంటున్న సీకాం డిగ్రీ కళాశాల చైర్మన్ సురేంద్రనాథ్‌రెడ్డి

తిరుపతి(విద్య), మార్చి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నమయ్య కూడలి సమీపంలోని సీకాం డిగ్రీ కళాశాలకు న్యాక్ రేటింగ్‌లో బి++ గ్రేడ్ వచ్చినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ టి.సురేంద్రనాథ్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 23, 24 తేదీల్లో న్యాక్ కమిటీ సభ్యులు కళాశాలను సందర్శించి వసతులను, విద్యా నాణ్యత ప్రమాణాలను పరిశీలించారని పేర్కొన్నారు. సీజీపీఏ 2.95 స్కోర్‌తో బి++ గ్రేడ్ ప్రకటించారని, ఆ మేరకు గురువారం సర్టిఫికెట్ అందజేశారని వెల్లడించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రెండవసారి ఈ ఘనత సాధించింది సీకాం కళాశాల మాత్రమేనంటూ సంతోషం వెలిబుచ్చారు.

శేషాచల కొండకు నిప్పు



తిరుమలనగర్ అటవీప్రాంతంలో చెలరేగిన మంటలు

మంగళం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మంగళం పరిధిలోని తిరుమలనగర్ అటవీ ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం నిప్పు రాజుకుంది. పెద్దయెత్తున మంటలు చెలరేగి ఎకరాల మేర పచ్చటి అడవి కాలిపోయింది. అటవీ సిబ్బంది రాత్రి 8 గంటల వరకు అదుపు చేస్తున్నా లాభం లేకపోయింది. మంటలకు గాలి తోడవడంతో ప్రయత్నాలు ఫలించడం లేదు. పక్షులు, పాములు, ఇతర జంతువులు, కీటకాలు మంటలకు ఆహుతయ్యాయి. ఆకతాయిలు అడవికి నిప్పు పెట్టి ఉంటారని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు రిజర్వ్ ఫారెస్టులోకి ప్రవేశించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఈద్గా మైదానంలో ఏర్పాట్లు చేయండి

తిరుపతి, మార్చి27(ఆంధ్రజ్యోతి) : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు ప్రార్థన చేసుకోవడానికి వీలుగా ఈద్గా మైదానంలో ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. గురువారం డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మున్సిపల్ అధికారులతో కలసి ఈద్గా మైదానాన్ని పరిశీలించారు. ఈద్గా మైదాన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం షాదీమహల్లో ఇచ్చే ఇఫ్తార్ విందులో ముస్లింలు తప్పకుండా హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎస్కే. బాబు, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డీసీ అమరయ్య, కూటమి, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన నైపుణ్య శిక్షణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో మూడు రోజులుగా చేపట్టిన నైపుణ్య శిక్షణ ముగిసింది. మైక్రోసాఫ్ట్ - ఏఐ స్కిల్స్‌పై ఈ శిక్షణ అందించారు. ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ స్టడీస్ విద్యార్థులకు ఈ శిక్షణ ఇచ్చారు. నిపుణులు వెంకటరమణ, అక్విందర్‌కౌర్, శాలిని రఘువంశీ నైపుణ్య శిక్షణ ఇచ్చారు. ఇందులో పాల్గొన్న ప్రతినిధులకు నిర్వాహకులు సర్టిఫికెట్లు అందజేశారు. అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వచ్చే నెలాఖరు లోపు శెట్టిపల్లి వాసులకు ప్లాట్లు కేటాయిస్తాం

మంత్రులు నారాయణ, అనగాని సత్యప్రసాద్



శెట్టిపల్లి భూములపై మంత్రులకు వివరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 27(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, పురపాలకశాఖ మంత్రి నారాయణ తెలిపారు. గురువారం విజయవాడలో వారు శెట్టిపల్లి పెండింగ్ అంశాలపై కలెక్టర్ వెంకటేశ్వర్, తుడా వీసీ మౌర్యతో సమావేశం నిర్వహించారు. శెట్టిపల్లి భూసమస్య పెండింగ్ అంశాలను, క్లియరెన్సు కావాల్సిన వాటిని కలెక్టర్ వారి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రులు మాట్లాడుతూ ఏప్రిల్ నెలాఖరు లోపు శెట్టిపల్లి పెండింగ్ లబ్ధిదారులకు లాటరీ పద్ధతిలో ఒకటిన్నర సెంటు స్థలం కేటాయించాలన్నారు. ఇతర అంశాల క్లియరెన్సుపై సంబంధిత కార్యదర్శులకు ప్రతిపాదనలు పంపి, త్వరితగతిన జీవోలు వచ్చే విధంగా పర్యవేక్షించాలన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

తిరుపతి(ఆటోనగర్), మార్చి 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి కుమార్ డిమాండ్ చేశారు. తిరుపతి విద్యుత్ సర్కిల్ కార్యాలయం ఎదుట నాలుగు రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు ఆయన సంఘీభావం తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షల్లో రవికుమార్, మురళి, బాబుయాదవ్, చలపతి, శంకర్‌రెడ్డి, నూర్‌బాషా, రవి, హుస్సేన్‌పీరాన్ పాల్గొన్నారు.

భర్త మరొకరిని పెళ్లి చేసుకున్నాడని..

తిరుపతి(నేరవిభాగం), మార్చి 27(ఆంధ్రజ్యోతి): భర్త వేరొక మహిళను పెళ్లి చేసుకున్నాడని, న్యాయం చేయాలని ఒక వివాహిత గురువారం పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు చెప్పిన వివరాల మేరకు.. అక్కారంపల్లికి చెందిన నవీన్‌కుమార్‌కు కొంత కాలం క్రితం సింధుతో వివాహమైంది. మనస్పర్థలు రావడంతో కొన్ని రోజుల క్రితం వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో నవీన్‌కుమార్ రెండో వివాహం చేసుకున్నాడు. తండ్రి, తల్లి, రెండవ భార్యతో కలసి అక్కారంపల్లిలో కాపురముంటున్నాడు. తనను కాదని వేరొక మహిళను పెళ్లి చేసుకోవడాన్ని జీర్ణించుకోలేక సింధు ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లింది. నవీన్‌కుమార్‌ను స్టేషన్‌కు పిలిపించి విచారించి పంపినట్లు ఎస్ఐ నాగార్జున రెడ్డి చెప్పారు. కేసు నమోదు చేయలేదని తెలిపారు.

ఆ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలి



వీసీ అప్పారావుకు విన్నవిస్తున్న ఆర్కే నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కేఎంఆర్, రాయలసీమ లా కాలేజీల గుర్తింపు రద్దు చేయాలని టీఎన్ఎస్ఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్కే నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎస్వీయూ వీసీ అప్పారావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్కే నాయుడు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ అండతో ఉన్నత విద్యామండలి అనుమతి లేకుండా, నోటిఫికేషన్‌తో సంబంధం లేకుండా, అక్రమ మార్గంలో రహస్యంగా ఇతర రాష్ట్రాల విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చారని ఆరోపించారు. ఈ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులను మరో కాలేజీకి మార్చి, ఈ కాలేజీల గుర్తింపు రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బషీర్, ప్రకాష్, పెద్దయ్య, లింగప్ప పాల్గొన్నారు.

విద్యుత్ భారాలను రద్దు చేయాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై వేసిన విద్యుత్‌భారాలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు సుబ్రహ్మణం కోరారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలో ప్రదర్శన నిర్వహించి స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును నిలిపేయాలన్నారు. స్థానిక రెండో పట్టణ పరిధిలోని వంకినగుంట ప్రాంతంలో నివాసం ఉంటున్న వారు ఖాళీ చేయాలని ఇచ్చిన నోటీసులు రద్దు చేసి వారికి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందజేయాలన్నారు. కౌలుసవరణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేసి వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జోగి శివకుమార్, బీవీ.రమణయ్య, వెంకట్రామిరెడ్డి, శేఖరాచారి, మధు, మణి, ప్రసాద్, శ్రీనివాసులు, నారాయణ, చంద్రయ్య, వెంకట్రావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేతలకు సన్మానం



విద్యార్థులను అభినందిస్తున్న డిప్యూటీ ఈవో సనత్‌కుమార్

గూడూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కబడ్డీ పోటీలలో స్థానిక జడ్పీ బాలురు ఉన్నత పాఠశాలకు విద్యార్థులు ప్రతిభ చాటడం సంతోషించ దగ్గ విషయమని డిప్యూటీ ఈవో సనత్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక డిప్యూటీ ఈవో కార్యాల యంలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ ఈ నెల 20, 21 వ తేదీలలో హిమచల్‌ప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన జాషువా అనే విద్యార్థి అండర్ -14 విభాగంలో ప్రథమ బహుమతి సాధించాడన్నారు. అండర్-17 విభాగంలో లోకేష్ తృతీయ బహుమతిని సాధించాడని వివరించారు. దీంతో వీరిని అభినందించామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం భారతి, పీడీ శివకుమార్ పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

గూడూరు అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాంధీనగర్ సమీపంలో ఓ యువకుడు మృతి చెందాడు. రూరల్ పోలీసుల కథనం మేరకు.. స్థానిక ఇందిరమ్మకాలనీలో సాహేయేల్(19) తన తల్లి మున్నీతో కలసి నివాసం ఉంటున్నాడు. సాహేయేల్ ఓ చికెన్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ నెల 18వ తేదీ నుంచి సాహేయేల్ కనిపించకపోవడంతో అతని తల్లి మున్నీ ఈ నెల 20న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాల వెనుక వైపు గ్రావెల్‌గుంతల సమీపంలో మృతిచెంది ఉన్నాడు. మృతదేహం కుళ్లిపోయి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేద విద్యార్థినికి రూ.1.20 లక్షల సాయం



విద్యార్థినికి నగదు అందిస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు జయరాజగోపాల్, కృష్ణారావులు

నాయుడుపేట, మార్చి 27 (ఆంధ్ర జ్యోతి) : బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న పేద విద్యార్థిని శ్రీలక్ష్మికి అమెరికాలోని బెస్ట్‌రన్నర్స్ అసోసియేషన్స్ రూ.1.20 లక్షలు ఆర్థికసాయం అందజేసింది. మునగాల కృష్ణారావు, రోటరీక్లబ్ అధ్యక్షుడు పెసల జయరాజగోపాల్ ద్వారా విద్యార్థినికి గురువారం నగదు అందించారు. నాయుడుపేట మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ కార్మికురాలిగా పనిచేస్తున్న రాజేశ్వరి కుమార్తె శ్రీలక్ష్మి బీఎస్సీ నర్సింగ్‌లో బాగా రాణించాన్ని రోటరీ క్లబ్ గుర్తించి. ఆర్థికసాయానికి కృషిచేసింది. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు చంద్రశేఖర్, ట్రినిటీ చైర్మన్ నాగూరయ్య, న్యాయవాది చంద్రశేఖర్, సోమశేఖర్, కట్టా సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఏపీడీ విచారణ

వాకాడు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాకాడు ఫీల్డ్ అసిస్టెంట్ వసంతమ్మపై ఏపీడీ వరప్రసాద్ గురువారం స్త్రీశక్తి భవనంలో విచారణ చేపట్టారు. పీడీ ఆదేశాల మేరకు ఉపాధి కూలీలు, ఏపీవో విజయమ్మ, ఎంపీడీవో శ్రీనివాసులతో కలిసి విచారణ సాగించారు. వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తానని ఏపీడీ తెలియజేశారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి



పొలాల్లో పడి ఉన్న పద్మయ్య నాయుడు మృతదేహం

బాలాయపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి) విద్యుత్ షాక్‌తో ఒకరు మృతిచెందారు. ఈ ఘటన మండలంలోని వెంగమాంబపురం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం మేరకు.. వెంగమాంబపురం గ్రామానికి చెందిన సాదనాల పద్మయ్య నాయుడు(35) గురువారం పొలానికి వెళ్లాడు. నీరు పెట్టేందుకు మోటారు వేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. పశువుల కాపరులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చెంచుకృష్ణయ్య

నాయుడుపేట టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా చెంచుకృష్ణయ్య ఎంపికైనట్లు ఆ సంఘం న్యాయవాదులు తెలిపారు. గురువారం కోర్టు ప్రాంగణంలో జరిగిన ఎన్నికల ప్రక్రియలో చెంచుకృష్ణయ్య విజయం సాధించినట్లు తెలిపారు. పలువురు న్యాయవాదులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందిస్తాం



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఈ

వెంకటగిరిటౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యమని విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్రరెడ్డి అన్నారు. గురువారం స్థానిక పాల కేంద్రంలో ఉన్న సబ్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలపై వచ్చిన అర్జీలను వారం రోజుల్లో పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలన్నారు. వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని కోరారు. 1.46లక్షల ముంది ఎస్సీ, ఎస్టీలకు సోలార్ ఉచితంగా ప్రభుత్వం అందజేస్తుందన్నారు. మిగిలిన వారికి 80శాతం సబ్సిడీతో అందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సోలార్‌ను అమర్చుకుంటే విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేసే విధంగా చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, ఏడీఈఈ ముని రవిచంద్ర, ఏఈలు అశోక్ రెడ్డి, అశోక్ కుమార్, జేఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

31 లోపు ఈకేవైసీ చేసుకోవాలి

తడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : రేషన్‌కార్డు లబ్ధిదారులు ఈ నెల 31వ తేదీ లోపు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని తహసీల్దారు శరత్‌బాబు తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ అండ గుండాల, మాంబట్టుల్లో రెండు చోట్ల ఆధార్ కేంద్రాలు ఉన్నాయని వీటిని సద్వినియోగం చేసుకొని ఈకేవైసీ పూర్తిచేయాలని తెలిపారు.

పటిష్ఠ బందోబస్తు నడుమ ఉరుసు

నాయుడుపేట టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పటిష్ఠ బందోబస్తు నడుమ ఉరుసు నిర్వహించనున్నట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. పట్టణంలోని హజరత్ అమీర్‌షావలి దర్గా ఉరుసును ఏప్రిల్ 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహిస్తుండటంతో ఆమేరకు గురువారం సీఐ ఉరుసు ప్రాంగణాన్ని పరిశీలించారు. బందోబస్తు వివరాలను నమోదు చేసుకున్నారు. సీఐ వెంట సిబ్బంది రామమోహన్‌రాజు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

జాతరకు ప్రత్యేక బస్సుల ఏర్పాటు

గూడూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం తూర్పుకనుపూరు గ్రామంలో జరుగుతున్న ముత్యాలమ్మ జాతరకు గూడూరు పాతబస్టాండు నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. గురువారం పాతబస్టాండు ప్రాంతం నుంచి భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా 40 బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు సిబ్బంది తెలిపారు.

ఆధార్ కేంద్రంలో చోరీ

గూడూరు అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ కార్యాలయం సమీపంలోని ఆధార్‌కేంద్రంలో గురువారం చోరీ జరిగినట్లు నిర్వాహకుడు వెంకటేష్ తెలిపారు. ఐరిష్ కెమెరా, తంబ్ మిషన్, ప్రింటర్ చోరీ చేశారని వాపోయాడు. సుమారు లక్ష రూపాయల విలువ చేసే వస్తువులు చోరీకి గురైనట్లు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టారు.

నవోదయకు బాలవిష్ణు



విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈవోలు వెంకటేశ్వర్లు, బాబయ్య

వెంకటగిరిటౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొగళ్లగుంట పాఠశాలకు చెందిన ఈదురి బాల విష్ణు నవోదయకు ఎంపికయ్యాడు. ఎంఈవోలు వెంకటేశ్వర్లు , బాబయ్య అభినందించారు. ఉపాధ్యాయులు సాయిరాం, సునీతలను అభినందించారు. విద్యార్థి తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి తల్లికి నేదురుమల్లి నివాళి

బాలాయపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జయంపు గ్రామ పంచాయతీకి చెందిన వెంకటగిరి ఏఎంసీ మాజీ చైర్మన్, వైసీపీ నాయకులు వెందోటి మధుసూధన్ రెడ్డి తల్లి సుగుణమ్మ ఇటీవల మృతి చెందారు. గురువారం ఆమె ఉత్తర క్రియలకు వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి విచ్చేశారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

గూడూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నులకు సంబంధించి ప్రభుత్వం వడ్డీలో సగం రాయితీ ఇస్తోందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ గురువారం కోరారు.

దారి సౌకర్యం కల్పించాలని వినతి

గూడూరు అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగళపూరు గ్రామంలో తమ పొలానికి దారి చూపించాలని గ్రామస్తులు పెంచలయ్య, గురవయ్య, సునీత, శ్రీనివాసులు గురువారం తహసీల్దారు చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చిల్లకూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదలవారిపాళెం గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. ఓజిలి మండలం బత్తలాపురం గ్రామానికి చెందిన ప్రణయ్‌కుమార్ జాతరకు వచ్చి బైక్‌పై వచ్చి తిరిగి గ్రామానికి వెళుతుండగా వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. అతడు గాయపడ్డాడు. అతడిని గూడూరు ఏరియా ఆస్పత్రికి అక్కడి నుంచి నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముత్యాలమ్మా..కరుణించవమ్మా







గురునాధస్వామి, అంకమ్మల గ్రామోత్సవం, వేయికండ్ల కుండలతో ప్రదక్షణ చేస్తున్న భక్తులు, ఆలయం వద్ద క్యూలైన్‌లో భక్తులు

చిల్లకూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలంలోని తూర్పుకనుపూరులో జరుగుతున్న ముత్యాలమ్మ జాతరకు గురువారం మూడో రోజున భక్తజనం పోటెత్తారు. జాతరకు వచ్చిన భక్తుల దాహార్తిని తీర్చేందుకు పలు కంపెనీలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ, తాగునీటి ప్యాకెట్లు, అంబళ్లు సరఫరా చేశారు. అంతేకాకుండా సిబ్బంది భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

నిర్వాహకులు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పాటకచ్చేరీ, కామెడీ షోలు, నృత్యాలు విశేషంగా ఆకట్టున్నాయి.

మొదటి విడత రీ సర్వేలో లోపాలను సరిచేస్తాం



తహసీల్దారు నుంచి వివరాలు తెలుసుకుంటున్న జిల్లా సర్వేయర్ అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్‌కుమార్

తడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మొదటి విడత రీ సర్వేలో జరిగిన తప్పులను సరిచేస్తామని జిల్లా సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ తెలిపారు. మొదటి విడత రీ సర్వేలో జరిగిన తప్పులను సరిచేయాలంటూ గొల్లలమలుగు గ్రామస్తులు కొద్ది రోజుల క్రితం కలెక్టర్‌ను కలసి విన్నవించారు. దీంతో జాయింట్ కలెక్టర్ ఆదేశాలతో గురువారం గొల్లలమలుగు గ్రామానికి జిల్లా సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ విచ్చేసి మొదటి విడత రీసర్వే రికార్డులను పరిశీలించారు. స్థానికుల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో ఎటువంటి తప్పులకు తావులేకుండా పక్కాగా నిర్వహిస్తామని తెలిపారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శరత్‌బాబు, సర్వే అధికారులు శ్రీరాములు, పెంచలయ్య తదితరులు ఉన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిలో నిజాలు నిగ్గుతేల్చాలి

నాయుడుపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతిలో పోలీసులు నిజాలు నిగ్గుతేల్చాలని లూథరన్ చర్చి బిషప్ మైకెల్ బెన్‌హర్ అన్నారు. నాయుడుపేట గాంధీమందిరం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు గురువారం ర్యాలీ చేపట్టారు. కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వినయ్‌కుమార్, రె.జి. రవికుమార్, సువార్తకులు జాషువ, మురళి, బెన్‌హర్, దేవరాజ్, విజయకుమార్, షబ్బీర్, పలు క్రైస్తవ సంఘాలు, ముస్లింలు పాల్గొన్నారు.

ఎస్‌వీఎస్‌ఎస్‌సీ డిగ్రీ కళాశాలకు ఏ- గ్రేడ్

సూళ్లూరుపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) :సూళ్లూరుపేటలోని ఎస్‌వీ ఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏ గ్రేడ్ దక్కింది. గురువారం 2023-24, 2024-25 సంవత్సర అకడమిక్ ఆడిట్ జరిగింది. అకడమిక్ అడ్వైజర్లగా నెల్లూరు డీకేడబ్ల్యూ, శ్రీకాళహస్తి డిగ్రీ కళాశాలకు చెందిన ఎస్.వింధ్యావళి, బి.దుర్గా అనూజ కళాశాలలో అన్ని విభాగాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అత్యున్నత ప్రమాణాలు పాటిస్తుండటంతో కళాశాలకు ఏ గ్రేడ్‌ను ప్రకటించారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌ఎల్‌బి శంకర్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కో-ఆర్డినేటర్ ఉషారాణి, అధ్యాపకులు డాక్టర్ వి.రాజా తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు

సూళ్లూరుపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండో రీసర్వే పనులు త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా సర్వేశాఖ అధికారి అనిల్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని సుద్దమడుగుతాగేలిలో పైలెట్ ప్రాజెక్టు కింద జరుగుతున్న రీసర్వే పనులను ఆయన పరిశీలించారు. సర్వేయర్లు బాలాజి, శరత్‌కుమార్, టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి ఉన్నారు.

ఒరిగిపోయిన బస్సు.. తప్పిన ప్రమాదం



సూళ్లూరుపేట మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి కనుపూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎపిక్ థియేటర్ సమీపంలో పిండిపాలెం రోడ్డులో రోడ్డు పక్క గోతిలోకి ఒరిగిపోయింది. గురు వారం రాత్రి 11 గంటల సమయంలో సూళ్లూరుపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 54 మంది ప్రయాణికులతో సూళ్లూరుపేట నుంచి పిండిపాలెం రోడ్డు మార్గంలో కనుపూరుకు బయలుదేరింది. ఎపిక్ థియేటర్ వద్ద రైల్వేగేటు దాటగానే రోడ్డుకు పక్కనే గోతిలో వెనుకటైరు దిగిపోవడంతో బస్సు ఒక్క సారిగా సగభాగం ఒరిగిపోయింది. ప్రయాణికులు ఒక్కసారిగా భయంతో కేకలు వేశారు. డ్రైవర్ వెంటనే బస్సును నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. ఆర్టీసీ వారు ఎక్స్‌కవేటర్‌ను తెప్పించి ఒరిగి పోయిన బస్సును తీసేందుకు ప్రయత్నాలు చేస్తు న్నారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

'కనుపూరు ముత్యాలమ్మ జాతర' పుస్తక ఆవిష్కరణ

కోట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కోట పట్టణంలోని మహాలక్ష్మమ్మగుడి ప్రాంగణంలో శుక్రవారం 'కనుపూరుజాతర' అనే పుస్తకాన్ని పలుస్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని కోటకు చెందిన ప్రముఖ రచయిత డాక్టర్ గాది శ్రీనివాసులు రచించారు.

ఎన్‌బీకేఆర్‌లో సాంకేతిక సదస్సు

కోట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో గురువారం పరిగ్రాహ్-2క25 జాతీయ సాంకేతిక సదస్సు జరిగింది. ఈ సదస్సును కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రాష్ట్రంలోని పలు ఇంజనీరింగ్ కళాశాల నుంచి విద్యార్థులు పాల్గొని పేపర్, పోస్టల్ ప్రజంటేషన్‌లు నిర్వహించారు. పది పత్రాలు ఉత్తమమైనవిగా ఎంపిక చేసి బహుమతులు ప్రదానం చేశారు.

కోటలో ఉచిత క్యాన్సర్ పరీక్షలు

కోట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కోట పట్టణంలోని సచివాలయ ప్రాంగణంలో గురువారం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు జరిగాయి. బీపీ, షుగర్ పరీక్షలతోపాటు పురుషులకు, మహిళలకు నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ నిర్ధారణలకు సంబంధించి పరీక్షలు జరిగాయి. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ గీతామణి, డాక్టర్ పద్మావతి, డాక్టర్ హరిత, సర్పంచ్ వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

సూళ్లూరుపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట బార్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. గురువారం సూళ్లూరుపేట బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నికల అధికారి బద్దెపూడి మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా సీనియర్ న్యాయవాది తిరుమూరు సుధాకర్‌రెడ్డి, కార్యదర్శిగా కే.ధర్మాప్రసాద్, జాయింట్ కార్యదర్శిగా పిడి.బాలరాజు, ఉపాధ్యక్షుడిగా ఎస్‌ఏ కరీం, ట్రెజరర్‌గా సి.రమేష్, లైబ్రరీ కార్యదర్శిగా డి.శేషగిరిరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా ఎస్.శ్రీరాముల యాదవ్, పి.లక్ష్మయ్య, పిఎస్‌ఆర్‌వి.ప్రసాద్, సీహెచ్.మురళి, నిశాంత్ సుల్తానా, ఎస్.శ్రీనివాసులు, మహిళా ప్రతినిధిగా సౌమ్య ఎన్నికయ్యారు.

దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులు, పండ్లు అందజేస్తున్న కౌన్సిలర్ షబ్బీర్

నాయుడుపేట టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ పండుగను ముస్లింలు సుఖ సంతోషాలతో జరుపుకోవాలని నాయుడుపేట మున్సిపల్ కౌన్సిలర్ షేక్ షబ్బీర్ కోరారు. రంజాన్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం షబ్బీర్ నివాసం వద్ద దాదాపు 300 మందికి పైగా నిరుపేదలకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు.

ఏప్రిల్ 1న జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలు

నాయుడుపేట టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఏప్రిల్ 1వ తేదీ జిల్లాస్థాయి రెజ్లింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు రెజ్లింగ్ సంఘ చైర్మన్ ఆదవరం అనుదీప్ గురువారం తెలిపారు. అండర్-15, అండర్-20 రెజ్లింగ్ జట్లను ఎంపిక చేస్తారని వివరించారు. వివరాలకు 9000024837 సంప్రదించవచ్చన్నారు.

పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించండి

వాకాడు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు అందరూ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. మండలంలోని కల్లూరు సచివాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. తాగునీటి ఎద్దడి లేకుండా స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. తాగునీటి ట్యాంకులను 15 రోజుల కోసారి క్లోరినేషన్ చేయాలని సూచించారు.

కులంపేరుతో దూషించారని పోలీసులకు ఫిర్యాదు

ఓజిలి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఓజిలి మండలం గ్రద్దగుంట పంచాయతీ జోస్యులవారికండ్రిగ ప్రాథమిక పాఠశాల కమిటీ చైర్మన్ వాకాటి గీతను అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు కులం పేరుతో దూషించారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. చైర్మన్, కమిటీ తీర్మానం లేకుండానే పాఠశాలలో స్వీపరును నియమించుకోవడంపై ప్రశ్నించడంతో కులం పేరుతో దూషించారని ఫిర్యాదులో పేర్కొంది.

పుత్తూరు వార్తలు

చేనేతల సంక్షేమం కోసమే ఉచిత విద్యుత్తు

● ఎమ్మెల్యే భానుప్రకాష్



ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను సత్కరిస్తున్న చేనేత కార్మికులు, టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లగా కలగా మిగిలిపోయిన చేనేత, మరమగ్గాల కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్తు అందించేందుకు శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. గురువారం చేనేతలు ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేని వారు ఘనంగా సత్కరించి, మొక్కను అందజేశారు. మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు, చేనేత కార్మికులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు వర్తింపచేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉచిత విద్యుత్ పథకం ద్వారా 93 వేల కుటుంబాల్లో ప్రభుత్వం వెలుగు నింపిందని మాజీ ఎంపీపీ అమ్ములు అన్నారు. చేనేత కార్మికులు, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ ధనపాల్, నాయకులు డీఎస్ గణేష్, కరుణాకరన్, అశోక్, డీజీ ధనపాల్, అనుబ్బు, శ్రీరామ్, బాలాజీ, పొన్నుస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం



అంబేడ్కర్ జయంతి ఆహ్వాన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ జరీనా తదితరులు

వడమాలపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని మండల అంబేడ్కర్ సంఘం, చిత్తూరు పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు పూరిమిట్ల మునిశేఖర్ చెప్పారు. గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద జయంతి వేడుకల ఆహ్వాన కరపత్రాలను తహసీల్దార్ జరీనా ఆవిష్కరించారు. మునిశేఖర్ మాట్లాడుతూ అంబేడ్కర్ సేవలను కొనియాడుతూ జయంతి ఉత్సవాలను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో దళిత నాయకులు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి హేమావతి, జయంత్, దేవరాయాలు, బాలగురవయ్య, వినోద్, జయచంద్ర, ప్రశాంత్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఢిల్లీ సీఎంకు సన్మానం



రేఖాగుప్తాకు బీజేపీ మహిళా నేతల సన్మానం

పుత్తూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తాను బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు నిషిధ రాజు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఆమె మాట్లాడుతూ బీజేపీ ఆధ్వర్యంలో ఢిల్లీలో సుపరిపాలన అందించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు చెప్పారు.

టీడీపీ సీనియర్ నాయకుడికి ఘన నివాళి

వడమాలపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారెడ్డి కండ్రిగకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, పిడతలకోన ఆయకట్టు చైర్మన్ కె.సోమశేఖర్‌రెడ్డి అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ గురువారం ఆ గ్రామానికి చేరుకుని సోమశేఖర్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ నిజాయితీ కలిగిన నాయకుడిని కోల్పోయామన్నారు. పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సుందరయ్యనగర్‌లో పేదలకు ఇంటి పట్టాలివ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

పుత్తూరు టౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణంలోని సుందరయ్యనగర్‌లో 2008లో 150 మందికి ఇంటి స్థలాలు ఇచ్చారని, వారికి పట్టాలు ఇవ్వాలని పుత్తూరు తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు సీపీఎం ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం ఇచ్చారు. సీపీఎం కార్యదర్శి ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ సుందరయ్యనగర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు మహేష్, సీపీఎం నాయకులు సుబ్రమణ్యం, విజయ్, కుమార్, శివ, సుందరయ్య నగర్ వాసులు, కల్పనమ్మ, అరుణ, జయమ్మ, కైలాసమ్మ, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌తో విజయ్‌బాబు భేటీ

పుత్తూరు అర్బన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు గురువారం మంగళగిరి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

రాష్ట్రంలో పరుగులు పెడుతున్న అభివృద్ధి

● ఎమ్మెల్యే ఆదిమూలం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. గురువారం నారాయణవనం మండలంలోని కళింమిట్టలో ఉదయం 10 గంటలకు సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. మధ్యాహ్నం నారాయణవనంలో అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, గోకులం షెడ్లు నిర్మించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, తహసీల్దార్ జయరాములు, ఎంపీడీవో గుణశేఖర్, మాజీ ఎంపీపీ గోవిందస్వామి, నాయకులు కేఎస్ రవి, సర్పంచ్ కేజీ శారదమ్మ, గణేషన్, వైస్ ఎంపీపీ శివశంకర్, ఐసీడీఎస్ సీపీడీపీవో తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల పరిశీలన

● కెమెరాలతో చిత్రీకరణ



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

సత్యవేడు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు తహసీల్దార్ కార్యాలయంలోని పురాతన రెవెన్యూ రికార్డులను సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయానికి చెందిన అధికారుల బృందం గురువారం పరిశీలించారు. మరోవైపు ఈ రెవెన్యూ రికార్డుల పరిశీలను కెమెరాలతో చిత్రీకరించడం చర్చనీయాంశంగా మారింది. కార్యాలయంలోని రికార్డుల గదిలో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన రికార్డులను బూజు దులిపి అణువణువు క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు నమోదు చేయడం గమనార్హం. రెవెన్యూ రికార్డులను పరిశీలనపై పలు వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవల శ్రీసిటీ పరిధిలో పారిశ్రామిక అవసరాల కోసం మండలంలోని ఇరుగుళం, కొల్లడం, పెద్దఈటి పాకం, రాళ్లకుప్పం గ్రామాల్లో 2500 ఎకరాలను సేకరించేందుకు ఏపీఐఐసీ ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో భూసేకరణలో గతంలో మాదిరిగా అవకతవకలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ముందుగా ఆయా గ్రామాల్లో రికార్డులను పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే రెవెన్యూ అధికారులు మాత్రం అలాంటిదేమీ లేదని, రికార్డులు పాతబడి పోయి ఎండకు ఎండి, వానకు తడిసి చిరిగి పోతుండడంతో వాటిని క్రమబద్ధీకరిస్తున్నట్లు చెబుతున్నారు.

ఘనంగా అహల్య భాయ్ హోల్కర్ జయంతి

శ్రీకాళహస్తి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో మరాఠా మాల్వ మహారాణి అహల్యాబాయ్ హోల్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైజాగ్ సామాజిక సమరసతా వేదిక ప్రాంత సాహితి ప్రముఖ్ దుర్గాప్రసాద్, తిరుపతి వెంకటేశ్వర ఆయుర్వేదిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణు దీక్షిత్ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. వారు మాట్లాడుతూ అహల్యాబాయ్ హోల్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు. ఆమె జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సామాజిక సమరసతా వేదిక అధ్యక్షుడు పసల వీరాస్వామి, ఉపాధ్యక్షుడు అంజూరు బాలసుబ్రహ్మణ్యం, సభ్యులు చంద్రశేఖర్, చిలకా రంగయ్య, ఈశ్వరయ్య, న్యాయవాది ప్రజ్ఞశ్రీ, మంగిరెడ్డి, సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఆర్‌సీకి చేరిన ఎస్‌ఏ-2 పరీక్ష పత్రాలు



సత్యవేడు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఏప్రిల్ 7వ తేదీ నుంచి జరగనున్న ఎస్‌ఏ-2 పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు గురువారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయానికి చేరుకున్నాయి. ఈ ప్రశ్నపత్రాలను ఎంఈవోలు రవి, ఉష ఆధ్వర్యంలో కార్యాలయంలోని ప్రత్యేక గదిలో భద్రపరచారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి తొమ్మిదవ తరగతి వరకు 3,514 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి వచ్చేనెల 7 నుంచి 17వ తేదీ వరకు ఎస్‌ఏ-2 పరీక్షలు జరగనున్నాయి.

పేదల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

రేణిగుంట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలంలోని పేదల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఎం నాయకులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో దళారులను నమ్మి భూములు కొనుగోలు చేసి నష్టపోయిన పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ సురేష్‌బాబుకు సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా సభ్యులు పుల్లయ్య, కమిటీ కన్వీనర్ హరినాథ్, నాయకులు వెంకటరమణ, ఎంపీటీసీ రాజేశ్వరి, ఈశ్వరమ్మ, కృష్ణ, సత్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి రోడ్డులో పాము కలకలం



రక్తపింజరి

శ్రీకాళహస్తి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి రోడ్డులో గురువారం పాము కలకలం రేపింది. రద్దీగా ఉన్న సమయంలో రోడ్డుపైకి భారీ రక్తపింజరి పాము ప్రవేశించింది. దీనిని చూసిన జనం భయందోళన చెందారు. పాము మెల్లగా నిర్మానుష్యమైన అయ్యనాడు చెరువు పొదల్లోకి వెళ్లడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సారాతో ప్రాణాలకు ముప్పు



మేలచ్చూరులో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సారాతో ప్రాణాలకు ముప్పు అని శ్రీకాళహస్తి ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లావణ్య అన్నారు. నవోదయం 2.0 సారా రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గురువారం శ్రీకాళహస్తి మండలం మేలచ్చూరు గ్రామ వీధుల్లో ఆటో ద్వారా సారా తాగడం వల్ల కలిగే అనర్థాలను పాటలు, స్లోగన్ల రూపంలో ప్రజలకు అర్థమయ్యే విధంగా తెలిపారు. అదే విధంగా కేవీబీపురం మండలం రంగయ్యగుంట, కళత్తూరు, దిగువపూడి, ఎగువపుత్తూరు గ్రామాల్లో కూడా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

ఆగమోక్తంగా ప్రదోష నందిసేవ



శ్రీకాళహస్తి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం ఆగమోక్తంగా ప్రదోష నందిసేవ జరిగింది. మొదట స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఆలయ అలంకార మండపంలో వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ప్రాకారంలో ప్రదోష నందిసేవ నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఎస్పీకి ఫిర్యాదు

వరదయ్యపాళెం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాండూరుకు చెందిన మహారాల స్నేహ(26) అనే యువతి ఈ నెల 25వ తేదీన సూళ్లూరుపేటలోని ఆస్పత్రికి వెళ్లింది. అయితే ఆమె తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు సూళ్లూరుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం గురువారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును తిరుపతిలో కలిసి మిస్సింగ్‌కేసు గురించి వివరించారు. తల్లిదండ్రులు కంగారు పడాల్సిన అవసరం లేదని, కేసును త్వరగా పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఎస్పీ హామీ ఇచ్చారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇస్తున్న కామి వెంకటేశ్వర్లు

శ్రీకాళహస్తి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని గురువారం నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ ఎస్సీ, ఎస్టీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కామి వెంకటేశ్వర్లు ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ సిరాజ్‌బాషా, ముస్లిం నాయకులు షేక్ జులేషా, లాల్‌బాషా, దావుద్‌బాయ్, జానీబాషా, రాజేంద్రనాయుడు, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వడ్డీ రాయితీని వినియోగించుకోండి'



ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తున్న పురపాలకసంఘ సిబ్బంది

శ్రీకాళహస్తి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాబు అగ్రహారం కూడలి వద్ద పురపాలక సంఘం అధికారులు వడ్డీ రాయితీ ఫ్లెక్సీని గురువారం ఏర్పాటు చేశారు. అధికారులు మాట్లాడుతూ ఏకమొత్తంలో ఇంటి పన్ను, ఖాళీ జాగా పన్ను చెల్లించేవారికి వడ్డీలో 50శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. పురపాలక సంఘ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను తమఫోన్‌లో స్టేటస్‌గా పెట్టుకోవాలన్నారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి దోహదపడాలని వారు కోరారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోండి



ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న జాకీర్

శ్రీకాళహస్తి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు జాకీర్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాకీర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 15 నుంచి వేసవిని పురస్కరించుకుని ఒంటి పూట బడులు జరుగుతున్నాయని, శ్రీకాళహస్తిలోని ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ రెండు పూటలా నిర్వహిస్తున్నారని చెప్పారు. రెండవ శనివారం కూడా తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ అధికారులకు పలుమార్లు చెప్పినా ఫలితం లేకుండాపోయిందని ఆయన తెలిపారు. మీరైనా స్పందించి ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు. రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో ప్రదోష పూజలు



ప్రత్యేక అలంకరణలో సోమనాథేశ్వర స్వామి

పిచ్చాటూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధిరాజు కండ్రిగలో కొలువైన గౌరీ సమేత సోమనాథేశ్వర స్వామి ఆలయంలో భక్తి ప్రపత్తులతో ప్రదోష పూజలు చేశారు. గురువారం సాయంత్రం నందీశ్వరుడికి ఆలయ ప్రధాన అర్చకులు నవీన్‌శర్మ పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చందనం పన్నీరులతో అభిషేకాలు చేసి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం నందీశ్వరుడికి పుష్పాలంకరణ జరిపి మహా, కుంభ, నక్షత్ర హారతులు పట్టారు. తదనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రాకారోత్సవం నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త జ్యోతిరాజు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



ప్రత్యేక అలంకారంలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేశారు. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నివాస ప్రాంతాల వద్దే పందుల ఆవాసం

● పట్టించుకోకుంటే ప్రమాదమే



ఆవాస ప్రాంతాల వద్ద సంచరిస్తున్న పందుల గుంపు

పిచ్చాటూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పిచ్చాటూరు పట్టణంలోని జగనన్న కాలనీ, శుభప్రియ సినిమా థియేటర్ కాలనీ, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ పరిసరాలు, అరణియార్ లోతట్టు ప్రాంతం, మిల్క్ డెయిరీ పరిసరాల్లో ఊర పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దీనికి తోడు వాహనాల రాకపోకలకు అడ్డంగా రావడం, పాదచారులపైన, వాహన చోదకుల మీద దాడికి తెగపడుతున్నాయి. నెల రోజుల క్రితం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద పంది రోడ్డుకు అడ్డంగా రావడంతో యువకుడు ద్విచక్ర వాహనం నుంచి పడి తీవ్ర రక్తగాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. జగనన్న కాలనీ రహదారి గుండా టెలిఫోన్ ఎక్స్ఛేంజి వీధికి వస్తున్న యువకుడిపై పిల్లల పంది దాడి చేయడం, చుట్టు పక్కల వారు వచ్చి అదిలించడంతో తృటిలో పెను ప్రమాదం నుంచి బయటపడ్డాడు. దీనికి తోడు మురికి కాలువల్లో చేరి బురదమయం చేయడంతో పారిశుధ్యం పేరుకుపోయి ఆవాస ప్రాంతాల వద్ద దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పందులను ఆవాస ప్రాంతాలకు దూరంగా తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

పిల్లలపై వడదెబ్బ పోటు

శ్రీకాళహస్తి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ఎండ తీవ్రతతో పసిపిల్లలపై వడదెబ్బ పోటు పడుతోంది. ఇటీవల మూడు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు పెరగడంతో పాఠశాలలకు వెళ్లే పిల్లలు డీహైడ్రేషన్‌కు గురవుతున్నారు. పిల్లలకు సరైన అవగాహన లేక వడగాలులతో నీరస పడుతున్నారు. శ్రీకాళహస్తిలో గురువారం ఈ సమస్య అధికంగా కనిపించింది. ఎండ తీవ్రత దృష్ట్యా 12ఏళ్ల లోపు పిల్లల పోషణపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఒంటి పూట బడి కావడంతో పిల్లలు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉండాల్సి ఉంది. ఈ పరిస్థితుల దృష్ట్యా పాఠశాలల్లో పిల్లలు ఎక్కువసార్లు నీరు తాగేలా జాగ్రత్తలు పాటించాలి. డీహైడ్రేషన్‌కు గురైన పిల్లలు మధ్యాహ్నం నుంచి ఇంటికి చేరుకున్న తరువాత ఒక్కసారిగా నీరసించిపోతున్నారు. ఆ తరువాత జ్వరం బారిన పడుతున్నారు. దీనిపై పిల్లలకు అవగాహన కల్పించాల్సి ఉంది.

తగిన జాగ్రత్తలు పాటించాలి



ఉదయం పాఠశాలల్లో పిల్లలు నీరు తాగేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి. నీరు తాగేందుకు రెండు మూడు సార్లు తరగతులకు ప్రత్యేకంగా విరామం కేటాయించాలి. మధ్యాహ్నం నుంచి ఇంటికి చేరుకున్న తరువాత తల్లిదండ్రులు పిల్లలు ఎండలో తిరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. అలాగే ఓఆర్ఎస్, మజ్జిగ, పండ్లు వంటివి ఇవ్వాలి. డీహైడ్రేషన్ గురైన పిల్లల్లో తీవ్రస్థాయిలో జ్వరం సోకుతుంది. నిర్లక్ష్యం చేయకుండా తడిబట్టతో శరీరం తుడుస్తూ దగ్గరలోని వైద్యులను సంప్రదించాలి.

- డాక్టర్ వెంకట్రామన్, చిన్నపిల్లల వైద్య నిపుణుడు

ముక్కంటి సేవలో ఆర్టీసీ జోనల్ చైర్మన్



మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద అప్పలనాయుడు

శ్రీకాళహస్తి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, బోర్డు డైరెక్టర్ రెడ్డి అప్పలనాయుడు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో మేనేజరు మునిచంద్రయ్య, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాళంగిలో ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కేవీబీపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళంగి గ్రామంలో కాళంగి రిజర్వాయర్ ఆయకట్టు చైర్మన్ రాజారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కోవనూరు పీహెచ్‌సీ సిబ్బంది వైద్యసేవలు అందించారు. వైద్యాధికారి జగదీష్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. వడదెబ్బ నుంచి తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎండలో ఎక్కువగా తిరగరాదని తెలిపారు. సుమారు 75మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేష్, మస్తాన్‌రావు, మోహన్‌బాబు, రమణయ్య, గోపి, బీజేపీ వెంకటయ్య, వాసు, సురేష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

డాక్టరేట్ గ్రహీత మల్లీశ్వరికి సన్మానం

పిచ్చాటూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికం(ధ్యానం), పచ్చదనం పెంపుపై విశిష్ట సేవలు అందించిన పిచ్చాటూరు హిందీ పండిట్ రాయల్ మల్లీశ్వరికి ఈ నెల 23న ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆమెను పిచ్చాటూరు అరణియార్ యోగా ధ్యాన సొసైటీ ఆధ్వర్యంలో గురువారం శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం నాగయ్య, పిచ్చాటూరు ఎంఈవో యుగంధర్ రాజు, రిటైర్డ్ ఎంఈవో రామలింగం, రిటైర్డ్ టీచర్ జయరామ్‌రాజు, పిచ్చాటూరు అరణియార్ యోగా, ధ్యానం సొసైటీ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా షబ్ ఏ ఖదర్ వేడుకలు

సత్యవేడు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ముస్లింల పవిత్ర రంజాన్ మాసంలో 27వ రోజు సందర్భంగా నిర్వహించే షబ్ ఏ ఖదర్ వేడుకలను మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవేడు, దాసుకుప్పం, శిరుణంబూదూరు, ఏఎంపురం గ్రామాల్లోని మసీదులను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి ముస్తాబు చేశారు. పిల్లలు, పెద్దలు రాత్రంతా మసీదులో నమాజులు చదివి, సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.

మునిశేఖర్‌రెడ్డి కుటుంబానికి పరామర్శ



నివాళులు అర్పిస్తున్న మధుసూదన్‌రెడ్డి తదితరులు

శ్రీకాళహస్తి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం కంచనపల్లి గ్రామానికి చెందిన మునిశేఖర్‌రెడ్డి కర్మక్రియల కార్యక్రమంలో గురువారం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు పాల్గొని, ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. వైసీపీ నాయకులు ఉన్నం వాసుదేవ నాయుడు, కోవి చంద్రయ్య నాయుడు, శ్రీరాములురెడ్డి, సురేష్, కంఠా ఉదయ్, మున్నారాయల్, జయశ్యామ్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



పేదలకు అన్నదానం చేస్తున్న జనసేన నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద జనసేన ఆధ్వర్యంలో గురువారం డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చంద్రశేఖర్, పేట చిరంజీవి, విశ్రాంత తహసీల్దారు చంద్రశేఖర్, లక్ష్మణ్, వెంకటరమణయాదవ్, చందు యాదవ్, మునిచంద్ర, మునికుమార్, సాయి, మహేష్, చందు, కత్తి మణి, వెంకటయ్య, వీర మహిళలు శారద, గాయత్రి, బత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత మృతి

కేవీబీపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ పుత్తూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత వెట్టి మునస్వామి(55) అనారోగ్యంతో గురువారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం ఆ గ్రామానికి వెళ్లి మునస్వామి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ నేతలు డాక్టర్ రమేష్, అయ్యప్ప, నాదముని పాల్గొన్నారు.

వైసీపీ యువజన అధ్యక్షుడికి సన్మానం



సురా సురేష్‌ను సన్మానిస్తున్న శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ యువజన అధ్యక్షుడిగా సురా సురేష్ ఎన్నికయ్యారు. ఈసందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తన నివాసంలో సురేష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు సాధన మున్నా రాయల్, బుల్లెట్ జయశ్యామ్, శరవణకుమార్, కంఠా ఉదయ్‌కుమార్, కొళ్లూరు హరినాథ్ నాయుడు, గణేష్, మురళీయాదవ్, మస్తాన్, వేలూరు రమేష్ పాల్గొన్నారు.

నేడు ఇఫ్తార్ విందు

శ్రీకాళహస్తి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న ఈదులగుంట షాదీమహల్ వద్ద శుక్రవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. సాయంత్రం 5.30 గంటలకు జరిగే విందుకు ముస్లింలు పాల్గొనాలని కోరారు.

ఆటోడ్రైవర్‌పై దాడి

రేణిగుంట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్‌పై దాడిచేసిన రైల్వే పార్కింగ్ కాంటాక్ట్ సిబ్బందిపై కేసు చేసిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తిరుపతి కొర్లగుంటకు చెందిన ఆటోడ్రైవర్ ప్రసాద్ ర్యాపిడో ఆటోను బుకింగ్ చేయడంతో రేణిగుంట రైల్వేస్టేషన్ పార్కింగుకు వచ్చాడు. అక్కడ రైల్వే పార్కింగ్ కాంట్రాక్టు సిబ్బంది కార్తీక్ పార్కింగ్ ఫీజు కట్టాలని చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో కోపోద్రిక్తుడైన కార్తీక్ తన చేతిలో ఉన్న టిక్కెట్ తీసే మిషన్‌తో ప్రసాద్‌పై దాడి చేశాడు. రక్తగాయాలైన ప్రసాద్ రేణిగుంట అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు రైల్వే కాంట్రాక్టర్, సిబ్బందిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.